



T/TG/2024/0523/7229/1544

# ఆకాంక్ష

తెలుగు సంచలన దిన పత్రిక




పబ్లిష్ : తెలంగాణ | శనివారం 14 -06-2025 | సంపుటి : 01 సంచిక :185 | ఎడిటర్ : పెనుగొండ సతీష్ | పేజీలు : 08 | వెల : 05 రూ /-

published Frome : Hyderabadh, vijayavada, karimnagar, chitur, khammam, warangal, nalgonda, rajamandri, visakapatnam, mahabub nagar, prakasham,nijambad, rajana sirisilla



# అహ్మదాబాద్ చేరుకున్న ప్రధాని

## ప్రధాని వెంట సిఎం భూపేంద్రపటేల్, రామ్మోహన్ నాయుడు

- ప్రమాదస్థలాన్ని పరిశీలించిన మోడీ
- ప్రమాద వివరాలపై అధికారులతో ఆరా
- ఘటనపై విమనాశ్రయంలో అధికారులతో సమీక్ష
- ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

**అహ్మదాబాద్,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** అహ్మదాబాద్ నుంచి లండన్‌కు బయలుదేరిన ఎయిరిండియా విమానం గురువారం ఘోర ప్రమాదానికి గురైన ప్రాంతాన్ని ప్రధాని మోడీ పరిశీలించారు. ప్రమాద ఘటనలో మొత్తం 265 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం అహ్మదాబాద్ చేరుకున్నారు. ఘటనాస్థలానికి వెళ్లి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. ప్రమాద వివరాలను అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ప్రమాదస్థలిలో కేంద్రమంత్రి రామ్మోమన్ నాయుడు, గుజరాత్ సిఎం భూపేందర్ పటేల్ కూడా ఉన్నారు. అక్క వీరంతా కలియతిరిగి ప్రమాద తీరును పరిశీలించారు. విమానం కుప్పకూలిన ఆనవాళ్లను మోడీ నిశితంగా పరిశీలించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించిన తర్వాత మోదీ అహ్మదాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. అక్కడి నుంచి నేరుగా అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రికి చేరుకున్నారు. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన ఏకైక విమాన ప్రయాణికుడు విశ్వాస్ కుమార్‌ను ప్రధాని పరామర్శించారు. గాయపడిన ఇతర మెడికోలతోనూ మోదీ మాట్లాడి ధైర్యం చెప్పారు. ఆయన వెంట గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్, కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర హోంమంత్రి హర్ష్ సంఘవి తదితరులు ఉన్నారు. అనంతరం ఈ ప్రమాదంపై మోదీ స్పందించారు. ఇది ఊహించని పెను విషాదమని, బాధిత కుటుంబాల బాధను తాను అర్థం చేసుకోగలననంటూ విచారం వ్యక్తం చేశారు. ఆప్తులను కోల్పోయిన బాధ దీర్ఘకాలం ఉంటుందని, ఆ వేదనను మాటల్లోనే చెప్పలేమని అన్నారు.



# ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభం

## హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో పాఠశాలలు ఏర్పాటు

### పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యం
### విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పించేలా బోధన
### అందుకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో మార్పులు
### అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్

**హైదరాబాద్,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపే తమ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం విద్యాశాఖపై సమీక్ష నిర్వహించిన సీఎం రేవంత్.. ప్రతీ విద్యార్థికి నాణ్యమైన అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామన్నారు. ఇందుకు అవసరమైన మౌలిక వసతులు, ఉపాధ్యాయులకు శిక్షణ, ఇతర సదుపాయాల కల్పనకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో 20 మంది కన్నా ఎక్కువ పిల్లలున్న గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సీఎం తెలిపారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు- నైపుణ్యాల పెంపునకు వీలుగా విద్యా వ్యవస్థను మార్పు చేయాలని సీఎం రేవంత్ సూచించారు. హైస్కూల్ స్థాయి నుంచే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తే భవిష్యత్‌లో వారు తమకు ఇష్టమైన రంగంలో రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పట్టణీకరణ వేగంగా సాగుతున్న

మిగతాది 2 లో...



# రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అరుదు

### టేకాఫ్ కాగానే ప్రమాదానికి అదే కారణం
### బ్లాక్‌బాక్స్ ఆధారంగా ప్రమాద కారణాల విశ్లేషణ

**అహ్మదాబాద్,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** గుజరాత్ రాష్ట్రంఅహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి 241 మంది ప్రాణాలు కోల్పోవడం దేశాన్ని దిగ్భ్రమలో ముంచింది. ఎందుకిలా జరిగిందన్న విశ్లేషణలు మొదలయ్యాయి. విమానానికి ఉన్న రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అన్నది అరుదైన విషయంగా పలువురు నిపుణులు భావిస్తున్నారు. అదికూడా టేకాఫ్ అయిన నిముషాల్లోనే జరగడం వంది అరుదని చెబుతున్నారు. ఇంజన్‌లో సాంకేతిక సమస్య వల్లే

మిగతాది 2 లో...



# విమాన ప్రమాదంతో అంటుకున్న ఇంధనం

- ఒక్కసారిగా వేయి డిగ్రీల ఉష్ణోగ్రత విడుదల
- సహాయక చర్యలకు తీవ్ర విఘాతం
- సహాయక చర్యలు పర్యవేక్షించిన అధికారుల వెల్లడి




**అహ్మదాబాద్,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న ఎయిరిండియా విమాన ప్రమాదం వందల కుటుంబాల్లో పెను విషాదాన్ని నింపింది. టేకాఫ్ అయిన కొన్ని క్షణాలకే ఈ విమానం కుప్పకూలి మంటల్లో దగ్ధమైంది. ప్రమాదానికి కారణమేంటనే దానిపై స్పష్టత రానప్పటికీ.. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ విమానం కూలిన తర్వాత ఘటనా స్థలంలో 1000 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతతో మంటలు

మిగతాది 2 లో...

# ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా రైతుభరోసా ఆగదు

### రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి
### కులగణన చేసి దేశానికి ఆదర్శంగా నిలిచిన రేవంత్ రెడ్డి
### స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తా చాటుతుంది
### ఖమ్మం పర్యటనలో మంత్రి తుమ్మల నాగేశ్వర రావు



**ఖమ్మం,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉన్నా రైతు భరోసా విషయంలో వెనుకడుగు వేయబోమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రచారం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి

మిగతాది 2 లో...

# ఎసిబి నోటీసులు ముమ్మాటికీ కక్షసాధింపే

### యధేచ్ఛగా దర్యాప్తు సంస్థల దుర్వినియోగం
### డైవర్షన్ పాలిటిక్స్ అమలుచేస్తున్న రేవంత్
### ఎక్స్ వేదికగా ఎమ్మెల్యే హరీష్ రావు విమర్శలు



**హైదరాబాద్,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** ఫార్ములా ఈ కార్ల రేసింగ్ వ్యవహారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు మరోసారి విచారణకు రావాలని నోటీసులు ఇవ్వడం రాజకీయ కక్ష సాధింపే తప్ప మరొకటి కాదని మాజీ మంత్రి, ఆ పార్టీ ఎంఎల్ఎ హరీష్‌రావు ఎక్స్ వేదికగా ఆరోపించారు. తన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని

మిగతాది 2 లో...

# ఎసిబి కేసుల్లో నిజాలు తేలుద్దామా:లై డిటెక్టర్ పరీక్షకు సిఎం రేవంత్ సిద్ధమా

### ఎక్స్ వేదికగా సవాల్ విసిరిన బిఆర్ఎస్ నేత కెటిఆర్

**హైదరాబాద్,జూన్13(ఆకాంక్ష న్యూస్) :** సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైరయ్యారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా కేటీఆర్ ట్వీట్ చేశారు. ముఖ్యమంత్రి ప్రజల దృష్టి మరల్చేందుకు పూటకో వేషం వేస్తున్నాడు.. రోజుకో కుట్ర చేస్తున్నాడు..ఫార్ములా ఈ రేసు నిర్వహణ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం, బ్యాంకు ద్వారా పంపిన 44 కోట్ల రూపాయలు ఇప్పటికీ ఫార్ములా ఈ సంస్థ అకౌంట్ లోనే ఉన్నా, వాటిని వెనక్కి రప్పించడం చేతకాని ముఖ్యమంత్రి మరోసారి ఏసీబీ నోటీసులు పంపాడు. చట్టాలను గౌరవించే పౌరుడిగా, తప్పకుండా సోమవారం ఉదయం 10 గంటలకు ఏసీబీ విచారణకు హాజరవడంతోపాటు-.. విచారణకు

మిగతాది 2 లో...



# రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం అరుదు

అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం జరిగిందని చెబుతున్నారు. విమానానికి ఉన్న రెండు ఇంజన్లు ఫెయిల్ కావడం వల్ల ప్రమాదం జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు.ఒక ఇంజన్‌లో సాంకేతికంగా లోపం వస్తే మరో ఇంజిన్‌తో విమానం నడుస్తుంది. కానీ గురువారం జరిగిన అహ్మదాబాద్ ప్రమాద సంఘటనలో రెండు ఇంజన్లు ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగిందని అంటున్నారు. ఇదో అరుదైన ఘటనగా వారు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాలు తక్కువని భావిస్తున్నారు.రెండు ఇంజన్లకు ఇంధనం అందకపోవడం వల్ల ఒక్కసారిగా కుప్పకూలి పోయి ఉంటుందని అన్నారు. టేకాఫ్ అయిన క్షణాల్లోనే విమానానికి సిగ్నల్ వ్యవస్థ కట్ అయిందని... ఇంధనం కూడా అందలేదని అందుకే విమానం కూలిందని అన్నారు. విమాన ప్రమాదాలను మూడు రకాలుగా చూస్తారు. పక్షులు ఢీ కొట్టినా , వాతావరణం ప్రతికూలంగా ఉన్నా, టెక్నికల్ ఎర్రర్ వచ్చినా ప్రమాదాలు జరుగు తుంటాయి. దేశంలో ఇప్పటి వరకు రెండు ఇంజన్లు ఫెయిల్ అయ్యి ప్రమాదం జరగడం ఇదే మొదటిసారి. బ్లాక్ బాక్స్‌ను డీకోడ్ చేస్తే కెప్టెన్, ఫైలెట్ ఏం అలర్ట్ ఇచ్చారో తెలుస్తుంది. కెప్టెన్ మే డే అని అలర్ట్ అయితే ఏటీసీకి అందజేసినట్లు తెలుస్తోంది. రెండు ఇంజన్లు ఫెయిల్ అయినప్పుడు ఏటీసీ కూడా ఏమీ చేయలేదు . ఏటీసీ కేవలం సిగ్నల్ వ్యవస్థతో పాటు అబ్జర్వేషన్‌ను మాత్రమే చేయగలదని చెప్పుకొచ్చారు. 787 డ్రీం లైనర్ విమానం అత్యంత పటిష్టమైనదన్నారు. టెక్నికల్ సమస్యలు తక్కువగా వస్తాయన్నారు. గత 11 ఏళ్లుగా ఈ విమానం సేవలు అందిస్తోంది. కానీ తాజాగా జరిగిన ప్రమాదంలో మాత్రం 787 డ్రీమ్ లైనర్ కూడా ఫెయిల్ అయింది. నిజానికి విమానం బయలుదేరడానికి ముందు టెక్నికల్ సిబ్బంది తనిఖీలు చేస్తారు. వారు ఎలాంటి ఎర్రర్‌ను గుర్తించకపోవడం అన్నది అనుమానాలకు తావిస్తోంది. అందుకే అహ్మదాబాద్ విమాన ప్రమాదంపై బ్లాక్ బాక్స్ డీకోడ్ చేస్తే అసలు విషయం తెలుస్తుందని నిపుణులు అంటున్నారు. బ్లాక్ బాక్స్‌లో కేవలం పైలట్, కో పైలట్ మాత్రమే వాయిస్ రికార్డు అవుతాయి తప్ప.. ప్రయాణికుల వాయిస్‌లు రికార్డ్ కావు. పైలెట్, కో పైలట్ ప్రయాణికులకు ఏదైనా అలర్ట్ చేసినా, సూచనలు చేసినా అవి రికార్డు అయ్యే ఛాన్స్ ఉంటుది. బ్లాక్ బాక్స్ అనేది మంటల్లో కాలిపోకుండా ఉండే విధంగా దాన్ని రూపొందిస్తారు. ఇప్పటి వరకు జరిగిన ప్రమాదాలు చూస్తే టేక్ ఆఫ్ అయ్యే సమయంలో మాత్రమే ఎక్కువగా టెక్నికల్ సమస్యలు వచ్చిందన్నారు. ఇప్పటి వరకు టెక్నికల్ సమస్యల ఆధారంగానే ప్రమాద ఘటనపై విచారణ సాగుతోంది. ఇకపోతే ఇందులో విద్రోహానికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నాయా లేవా అన్న కోణంలోనూ దర్యాప్తు చేస్తారు.

# విమాన ప్రమాదంతో అంటుకున్న ఇంధనం

చెలరేగినట్లు అధికారులు వెల్లడించారు. దీంతో సహాయక చర్యలు అత్యంత క్లిష్టంగా మారినట్లు– పేర్కొన్నారు. ప్రమాదానికి గురైన విమానంలో 1.25 లక్షల లీటర్ల ఇంధనం ఉందని, మంటలు వ్యాపించడంతో ఎవరినీ కాపాడే పరిస్థితి లేకుండా పోయిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనిపై ఎస్‌డీఆర్ఎఫ్ అధికారి ఒకరు స్పందించారు. ప్రమాదం గురించి సమాచారం రాగానే మధ్యాహ్నం 2–2.30 గంటల ప్రాంతంలో మా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అంతకుముందే హాస్టల్‌లో శిథిలాల కింద చిక్కుకున్న కొంతమందిని స్థానికులు కాపాడారు. మంటలు వ్యాపించడం ఎక్కువైన తర్వాత పరిస్థితి చేదాటిపోయిందని ఆ అధికారి వివరించారు. గతంలో మేం ఎన్నో సహాయక చర్యలు చేపట్టాం. కానీ, ఇలాంటి విపత్తును ఇంతకుముందెప్పుడూ చూడలేదు. విమానంలోని ఇంధన ట్యాంక్ పేలిపోవడంతో అగ్నిగోళం ఏర్పడింది. క్షణాల వ్యవధిలోనే అక్కడి ఉష్ణోగ్రత 1000 డిగ్రీల సెల్సియస్‌కు పెరిగింది. దీంతో బయటపడే అవకాశం లేకుండా పోయింది. మేం పీపీఈ కిట్లు– వేసుకొని ఘటనాస్థలానికి చేరుకున్నా.. వేడి తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలిగింది. పక్షులు, శునకాలు కూడా పారిపోలేనంత స్థాయిలో ఉష్ణోగ్రత ఉంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో పలు పక్షులు, శునకాలు కాలిబూడిదయ్యాయి. ఎటుచూసినా శిథిలాలే కన్పించాయి. వాటి కింద తీవ్రంగా కాలిపోయిన ప్రయాణికులను గుర్తించడం సవాల్‌గా మారిందని మరో అధికారి ఆ భయానక దృశ్యాలను గుర్తుచేసుకున్నారు.ఈ ప్రమాదంలో విమానంలోని 241 మందితో పాటు– వైద్యకళాశాల హాస్టల్‌లో ఉన్న 24 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరి మృతదేహాలకు అహ్మదాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో శవపరీక్ష నిర్వహించారు. ప్రమాదం ధాటికి చాలా మృతదేహాలు గుర్తుపట్టలేనివిధంగా కాలిపోయాయి. దీంతో డీఎన్ఏ పరీక్షలు నిర్వహించి మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్నారు.

# అహ్మదాబాద్ చేరుకున్న ప్రధాని

ఈ విషాద సమయంలో తన ఆలోచనంతా బాధిత కుటుంబాల గురించేనని తెలిపారు. మరోవైపు ఎయిరిండియా ఎండీ, సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ కూడా ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి ఘటన జరిగిన తీరును పరిశీలించారు. ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. బ్రిటిష్ హైకమిషన్ అధికారులు కూడా నేడు అహ్మదాబాద్‌కు చేరుకున్నారు. ప్రమాద స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. జాగిలాల సాయంతో మృతదేహాల కోసం శిథిలాల కింద గాలిస్తున్నారు. ఈ ప్రమాద సమయంలో విమానంలో మొత్తం 242 మంది ప్రయాణికులు, సిబ్బంది ఉన్నారు. వీరిలో 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఒకే ఒక్క ప్రయాణికుడు మృత్యుంజయుడిగా బయటపడ్డారు. గుజరాత్ మాజీ సీఎం, భాజపా నేత విజయ్ రూపాణీ కూడా ఈ ప్రమాదంలో మృతి చెందారు. ఇక, ఈ విమానం బీజే వైద్య కళాశాల మెడికోల వసతి గృహ సముదాయంపై కూలిన సంగతి తెలిసిందే. దీంతో అందులోని 24 మంది మృత్యువాత పడ్డారు. విమానంలో 169 మంది భారత పౌరులు కాగా.. 53 మంది బ్రిటన్‌వాసులు, ఇతర విదేశీయులు ఉన్నారు.

# ఎసిబి నోటీసులు ముమ్మాటికీ కక్షసాధింపే

మల్లించేందుకు రేవంత్ రెడ్డి దర్యాప్తు సంస్థలను యథేచ్ఛగా దుర్వినియోగం చేస్తున్నారని అనడానికి కెటిఆర్‌కు ఇచ్చిన తాజా నోటీసులే నిదర్శనం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలని నిరంతరం ప్రశ్నిస్తున్న కెటిఆర్ నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసేందుకే రేవంత్ రెడ్డి నోటీసులు పంపించారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 18 నెలల పాలనలో డైవర్షన్ పాలిటిక్స్‌ను అమలు చేస్తూ బిఆర్ఎస్‌ను బద్నామ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా రేవంత్ రాజకీయ అరాచకత్వం గెలిచే ప్రసక్తే లేదని, రేవంత్ రెడ్డి డ్రామా, డైవర్షన్ రాజకీయాలు ఇప్పటికే రాష్ట్ర ప్రజలకు అర్థమయ్యాయని పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేసింగ్‌తో తెలంగాణ ప్రతిష్ట పెరిగిందని, పెట్టు–బడులు కూడా వచ్చాయని తెలిపారు. తెలంగాణ ప్రతిష్ట పెంచినందుకా కెటిఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం నోటిసుల ప్రతాపం..? అని ప్రశ్నించారు. 2000లో చంద్రబాబు ఫార్ములా వన్ కోసం కృషిచేసి నిర్వహించలేకపోయారని, అలాంటిది బిఆర్ఎస్ ప్రభుత్వం,కెటిఆర్ కృషి వల్ల ఫార్ములా వన్ వంటి ప్రతిష్టాత్మక రేస్‌ను భారతదేశానికి అందులోనూ హైదరాబాద్‌కి తీసుకొని వచ్చారని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తెలంగాణను మార్చేందుకు ఫార్ములా ఈ రేస్‌ను హైదరాబాద్‌లో నిర్వహించి పెట్టు–బడులను ఆకర్షించారని, అమర్ రాజా వంటి కంపెనీలు పెట్టు–బడి పెట్టేందుకు ముందుకు వచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలు నిర్వహించి రాష్ట్ర పరువును, దేశ పరువును మంటకలిపిందని మండిపడ్డారు. అందాల పోటీ–తో లాభం లేదు కానీ రాష్ట్ర పరువు మాత్రం తీశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపినందుకు, రేవంత్ రెడ్డిని విమర్శిస్తున్నందుకు కెటిఆర్‌కి ఎసిబి నోటీసులు ఇచ్చిందని స్పష్టమవు తున్నదని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ఎన్ని రకాలుగా వేధించినా ఆయన వైఫల్యాలను ఎండగట్టడం మాత్రం బిఆర్ఎస్ ఆపదు అని హరీష్‌రావు స్పష్టం చేశారు.

# ఎసిబి కేసుల్లో నిజాలు తేలుద్దామా

అన్నివిధాలుగా సహకరిస్తానని మాటిస్తున్నాను. అయితే, పదేళ్ల క్రితం నోటుకు ఓటు కుంభకోణంలో నోట్లకట్టలున్న నల్లబ్యాగుతో రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డ రేవంత్ రెడ్డి కేసు కూడా ఇదే ఏసీబీ పరిధిలో పెండింగ్‌లో ఉంది. ఇద్దరిపై కూడా ఏసీబీ కేసులున్న నేపథ్యంలో.. ఇద్దరిలో దోషులెవరో, నిర్దోషులెవరో తేల్చేందుకు జడ్జి సమక్షంలో లైవ్ టెలివిజన్ సాక్షిగా లై డిటెక్టర్ టెస్టును ఎదుర్కొనే దమ్ము, ధైర్యం ఈ పిరికి ముఖ్యమంత్రికి ఉన్నదా? అని ప్రశ్నించారు. ఓవైపు మీ దివాళాకోరు విధానాలతో రాష్ట్ర ఖజానా ఖాళీ అని ఓ ముఖ్యమంత్రిగా నిస్సిగ్గుగా మీ అసమర్థతను చాటుకుంటున్న ఈ తరుణంలో.. విచారణల కోసం ప్రజాధనాన్ని వృథా చేయడం మానుకుని, వెంటనే లై డిటెక్టర్ టెస్టుకు సీఎం రేవంత్ సిద్ధందకావాలని పేర్కొన్నారు. కేటీఆర్‌కు తాజాగా ఏసీబీ నోటీ–సులు జారీ చేసింది. ఫార్ములా ఈ కారు రేసు కేసులో జూన్ 16న విచారణకు హాజరు కావాలంటూ నోటీసుల్లో పేర్కొంది. ఆ నోటీసులపై కేటీఆర్ స్పందించారు. ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌పై దుయ్యబట్టారు.



# ఆర్థిక పరిస్థితి ఎలా ఉన్నా రైతుభరోసా ఆగదు

తుమ్మల నాగేశ్వరరావు కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం రఘునాథపాలెం మండలంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి తుమ్మల పాల్గొన్నారు. రేగులచలక, కోయచెలక గ్రామాల్లో సీసీ రోడ్లు బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం రఘునాథపాలెం మండలం కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మంత్రి తుమ్మల పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కులగణన చేసిన దమ్మున్న నాయకుడు రేవంత్‌రెడ్డి అని అభివర్ణించారు. దేశమంతా పాదయాత్ర చేసి కులగణనకు ఆలోచన చేసిన నాయకుడు రాహుల్ గాంధీ అని కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ చేసి మిగతా రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని ఉద్ఘాటించారు. దివంగత ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ పాలనలో దేశమంతా రూ. 70 వేల కోట్లు రుణమాఫీ చేస్తే.. తెలంగాణలో రూ. 21 వేల కోట్లు– రుణమాఫీ చేశారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గుర్తుచేశారు. ఇతర జిల్లాల వారు ఖమ్మంలో నివసించాలనే ఆలోచనలు వచ్చేలా ఖమ్మం నగరాభివృద్ధి జరుగుతోందని తెలిపారు. అధికార పార్టీ వారు సర్పంచ్‌లు.. ఎంపీటీసీ జెడ్పీటీసీలుగా ఎన్నికైతే ప్రజలకు చేరువ కావొచ్చని మంత్రి చెప్పారు. గోదావరి జలాలతో ఉమ్మడి ఖమ్మం జిల్లా సస్యశ్యామలం చేయడం తన రాజకీయ లక్ష్యమని మంత్రి తుమ్మల ఉద్ఘాటించారు. రైతు సంక్షేమమే ప్రజా పాలన ధ్యేయమని చెప్పారు. పనిచేసే కార్యకర్తలకు పార్టీ పదవుల్లో పెద్దపీట వేస్తామని అన్నారు. ప్రజాభిమానం ఉంటే పదవులు అవే దక్కుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. రైతుల రుణభారం తగ్గించేందుకు పాత రుణాల మాఫీ పూర్తయ్యిందని మంత్రి తెలిపారు. రైతు బంధు పేరుతో గతంలో అన్ని పథకాలు ఆపేశారు. కానీ ఇప్పుడు అన్నింటినీ ఒక్కొక్కటిగా తీర్చుకుంటూ వస్తున్నాం. ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లోకి నేరుగా వెళ్లింది రూ.36,000 కోట్లని వెల్లడించారు. విత్తనాల విషయంలో నకిలీ విత్తనాలను అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. నకిలీ విత్తనాల విషయంలో పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. ఎరువుల విషయంలో షిప్ రాకపోవడం వల్ల ఇబ్బందులు వచ్చాయని చెప్పారు. యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. అన్ని జబ్బులకూ కారణం యూరియా. కేంద్రానికి కూడా సలహా ఇచ్చాను. యూరియా తగ్గిస్తే మన పంటలకు ప్రపంచ మార్కెట్ లో విలువ పెరుగుతుందని అన్నారు. డ్రై ల్యాండ్ పంటలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్టు–, గతంలో ఇచ్చినట్లే ఇప్పుడు కూడా మద్దతు ఇస్తామని చెప్పారు. తోటలు వేసిన రైతులకు కూడా రైతు భరోసా ఇచ్చే యోచనలో ఉన్నామన్నారు. పెంచిన మద్దతు మొత్తం రూ.6,000. మునుపు రూ.5,000 ఇస్తే, ఇప్పుడు పెంచాం అని తెలిపారు. పామాయిల్ ఉత్పత్తిపై ప్రాముఖ్యత పెరుగుతోంది. కొణిజర్లలో రిఫైనరీ, సీడ్ గార్డెన్ ఏర్పాటు– అవుతుంది. ఇది దేశంలో ఎక్కడా లేనిది. వచ్చే సీజన్‌కు వెంసూర్, కొణిజర్ల ఫ్యాక్టరీలు సిద్ధం చేస్తాం అని వెల్లడించారు. తెలంగాణలో మినిమం గ్యారెంటీ– ప్రైస్ ఉండాలని కోరారు. దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కలిసి ప్రధానిని కలిసి ఒత్తిడి తీసుకురాగలమని భావిస్తున్నాం అని తెలిపారు. తెలంగాణ వరి ఉత్పత్తిలో టాప్ లో ఉందని గుర్తుచేశారు. కాళేశ్వరంపై ఈటల రాజేందర్ ఆరోపణలపై స్పందిస్తూ, కమిషన్ రిపోర్ట్ వచ్చిన తర్వాత ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ప్రజాధనం దుర్వినియోగం కాకూడదు, కానీ అభివృద్ధి జరగాలని అన్నారు. అలాగే మార్కెట్ చైర్మన్ నియామకం ఎమ్మెల్యే పరిధిలో జరిగిందని పేర్కొన్నారు.


# ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభం

నేపథ్యంలో విద్యా శాఖ పురపాలక శాఖతో సమన్వయం చేసుకొని హెచ్ఎండీఏ, మున్సిపల్ లేఅవుట్లలో సామాజిక వసతుల కోసం గుర్తించిన స్థలాల్లో పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ– ఇలా వివిధ విభాగాల కింద ఇంటర్మీడియట్ వరకు ఉన్న వివిధ విద్యా సంస్థలను హేతుబద్ధీకరించి ప్రతి పాఠశాలలో నిర్దిష్ట సంఖ్యలో విద్యార్థులు ఉండేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యమైన భోజనం, యూనిఫాంలు, పాఠ్య పుస్తకాలు అందిస్తుండడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు గురుకులాల వైపు మొగ్గు చూపుతున్నారని.. డే స్కాలర్స్‌కూ ఆ పాఠశాలల్లోనే అవన్నీ అందించే విషయంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. పిల్లలకు కుటుంబం, సమాజం ప్రాధాన్యాన్ని వివరించడంతో పాటు– కుటుంబం, సమాజం పట్ల వారి బాధ్యతను తెలియజేసేలా కౌన్సెలింగ్ ఇప్పిస్తే వారు మానసికంగా దృఢంగా తయారవడంతో పాటు– బాధ్యతాయుతమైన పౌరులుగా రాణిస్తారని సీఎం రేవంత్ అభిప్రాయపడ్డారు. అందరికీ విద్యనుచేరువ చేయాలన్న లక్ష్యంతో ఈ ఏడాది కొత్తగా 571 పాఠశాలలు ప్రారంభిస్తున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులకు భాషా పరిజ్ఞానంతో పాటు– నైపుణ్యాలు పెంచేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. లేఅవుట్లలో ప్రజల అవసరాల కోసం కోటాయించిన స్థలాల్లో బడులు నిర్మించాలని ఆదేశించారు. గురుకులాల తరహాలో సౌకర్యాల కల్పనపై అధ్యయనం చేయాలని సూచించారు. డేస్కాలర్లకూ భోజనం, యూనిఫామ్, పుస్తకాల సరఫరాపై అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. పిల్లలకు కుటుంబం, సమాజంపై బాధ్యత తెలిసేలా కౌన్సిలింగ్ ఇప్పించాలని స్పష్టం చేశారు.



# మితిమీరిన ట్రంపరితనం !

**(ఆకాంక్ష న్యూస్) :** ట్రంప్ కాలుమోపి అప్పుడే ఆరునెలలు కావస్తోంది. ఈ ఆరు నెల్లలో అమెరికా పతననానికి పునాదులు వేశాడనే చెప్పాలి. అమెరికా ఫస్ట్ అన్న నినాదంతో చేస్తున్న చేష్టలు వెగటు పుట్టిస్తున్నాయి. ఎంతగా అంటే అమెరికన్‌లే ట్రంప్‌ను ఏకి పడేస్తున్నారు. అధ్యక్షుడి చర్యలను ఈసడించుకుంటున్నారు. చివరకు వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేస్తున్నారు. ఇలా లాస్‌ఎంజిల్స్‌లో ఆందోళనలు పరాకాష్టకు చేరిన నిరసనలుగా చూడాలి. వారిపై మిలిటరీని ప్రయోగించడం, విదేశీ హస్తం ఉందని చెప్పడం, ట్రంప్ చేతగాని పాలనకు నిదర్శనంగా చూడాలి. అమెరికాలో ఎప్పటినుంచో వలసవ చ్చి అకడే కూలీనాలీ చేసుకుంటున్న వారిపై దాష్టీకం ప్రదర్శించడం ట్రంప్‌కే చెల్లింది. నిజానికి వారు లేకుంటే అమెరికా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది. ఇతర దేశాల ప్రజలు చెమటోడ్చి అమెరికా ఆర్థికవ్యవస్థను నిలబెడుతున్నారు. ఇది ట్రంప్ గమనించక పోవడం దౌర్భాగ్యం. ట్రంప్ 'ప్రాజెక్టు 2025' పేరుతో అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాల్లో భాగంగా అధికారంలోకి రాగానే అనేక అంశాల్లో వేలు పెడుతూ పోతున్నాడు. తనకు తోచిన నిర్ణయాన్ని ప్రకటిస్తున్నాడు. ఇతర దేశస్తులను పురుగుల్లాగా చూస్తున్నాడు.. అక్రమంగా వలస వచ్చిన వారిని స్వదేశాలకు పంపాలి. లేకపోతే అరెస్టు చేసి జైల్లో పెట్టాలని ఇచ్చిన ఆదేశాలతో లాస్ ఏంజల్స్ నగరం ఇప్పుడు ఆందోళనలతో అట్టుడుకుతోంది. కొద్ది రోజులుగా అక్రమ వలసదారుల పేరుతో కొంత మందిని అరెస్టు చేసి జైల్లో పెట్టటంతో వారంతా వీధుల్లోకి వస్తున్నారు. వారిని అదుపు చేసేందుకు ట్రంప్ సర్కార్ మిలిటరీని దింపింది. వలసదారులు శత్రు దేశాల మాదిరి లాస్ ఏంజల్స్‌ను ఆక్రమించుకున్నట్లుగా చిత్రించి నగరాన్ని విముక్తి చేయాలని ట్రంప్ ఆదేశించడం అవివేక చర్య తప్ప మరోటి కాదు. ఆ రాష్ట్ర గవర్నరే దీనిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాడు.. అక్రమ వలసదారులుగా చెబుతున్నవారు అమెరికాలో కోట్లాది మంది ఉన్నారు. అక్కడ తలెత్తిన ఆర్థిక, ఉపాధి సమస్యలను పరిష్కరించటంలో విఫలమైన పాలకులు వలస వచ్చిన వారే అన్నింటి కీ కారణమంటూ విద్వేషాన్ని రెచ్చగొడుతున్నారు. కాకపోతే ఈ




విషయంలో ట్రంప్ ముందున్నాడు. అక్రమ వలసదారులను ఏరివేసే పేరుతో ఇమ్మిగ్రేషన్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది నగరమంతటా వందలాది మందిని అరెస్టు చేయటాన్ని జనం నిరసిస్తున్నారు. వీధుల్లోకి వచ్చి ఆందోళనలకు దిగారు. తమ అధికారాన్ని అతిక్రమించి మిలిటరీని దించటాన్ని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ న్యూసమ్ కోర్టులో సవాలు చేశాడు. వెనక్కు తగ్గేది లేదని ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ మరింతగా రెచ్చగొడుతూ ప్రకటించాడు. విదేశీ వ్యతిరేకత, ఉన్మాదాలను రెచ్చగొడుతున్నారు. కేవలం నిరసన ప్రదర్శనలు జరిగిన వెంటనే ట్రంప్ తీసుకున్న ఈ అసాధారణ చర్య ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాల్సి ఉంది.ట్రంప్ తీరుతో ప్రస్తుతం లాస్ ఏంజల్స్‌లో పరిస్థితి ఉద్రిక్తంగా ఉంది. అణచివేత ఏ రూపం తీసుకుంటుందో, దానికి ప్రతిఘటనలో ఏం జరుగుతుందో అన్న ఆందోళన నెలకొంది. నిజానికి చౌకగా పని చేయించుకొని లాభాలు పొందేందుకు అమెరికా వాణిజ్య, పారిశ్రామిక సంస్థలు, వ్యవసాయ క్షేత్రాల వారు వలసలను ప్రోత్సహించారు. చట్టబద్ధం గా వచ్చిన వారితో పాటు అక్రమంగా వచ్చిన వారిని చూసీచూడనట్లు అధికార యంత్రాంగం వ్యవహరిం చింది. అయితే వీరంతా చెమటోడ్చుడం వల్లనే అక్కడి ప్రగతిరథచక్రాలు కదులుతున్నాయి. ఆర్థిక వ్యవస్థలో వారి పాత్ర తక్కువేమీ కాదు. వ్యవసాయం, సేవారంగం, నిర్మాణ రంగాలలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇలాంటి వారివల్ల లాభాలు పొందుతున్న వారు మాత్రంకిమ్మనడం లేదు. వీరు వెళ్లిపోతే ఆయా పనులు చేసేందుకు అమెరికాలో ఒక్కరంటే ఒక్కరుకూడా మిగలరు. కరోనా తరువాత ఆర్థిక వ్యవస్థ పెరుగుదలకు, ద్రవ్యోల్బణం తగ్గటానికి వలస కార్మికులు తోడ్పడ్డారని డాలస్ ఫెడరల్ రిజర్వుబ్యాంకు అధ్యయనం తెలిపింది. అమెరికాలో పుట్టి పెరిగిన వారు ఉద్యోగ విరమణ చేయటం, జననాల రేటు తగ్గిన కారణంగా 2019–21 మధ్య 20 లక్షల మంది కార్మికులు తగ్గినట్లు, రానున్న పది సంవత్సరాలలో వలస కార్మికులు లేకపోతే వివిధ రంగాలలో ముఖ్యంగా వ్యవసాయం, ఆరోగ్య సంరక్షణలో ఈ పరిణామం తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరికలు వెలువడ్డాయి. రానున్న సంవత్సరాల్లో వంట, ఇంటి పనివారు, డ్రైవర్లు, ఆరోగ్య, వ్యక్తిగత సంరక్షణ వంటి పనులు చేసేందుకు డిమాండ్ పెరగనుందని చెబుతున్నారు. వలస వచ్చిన వారి కారణంగానే స్థానికులకు అందాల్సిన సౌకర్యాలకు కోత పడుతున్నదని కొందరు సర్వేలు, బడ్జెట్ల పేరుతో రెచ్చగొట్టేందుకు పూనుకున్నారు. వలస వచ్చిన వారి గృహ వసతి కోసం న్యూయార్క్ వంటి నగరాల్లో బడ్జెట్ కేటాయింపులు చేస్తూ ఇతరులకు కోత పెడుతున్నారని చిత్రిస్తున్నారు. నిజానికి పైన చెప్పుకున్నట్లుగా వలస వచ్చిన వారి నుంచి వచ్చే రాబడితో పోల్చుకున్నపుడు ఇవి పెద్ద మొత్తాలేమీ కాదు. వారు పని చేస్తున్న పరిశ్రమలు, వాణిజ్య, వ్యవసాయ రంగాల నుంచి వారి సంక్షేమానికి ప్రభుత్వం పన్నులు మరొక రూపంలో అదనంగా నిధులు సేకరించటాన్ని ఎవరూ తప్పుపట్టరు. కానీ వారికి నానాటికీ మరిన్ని రాయితీలు ఇస్తున్నారు తప్ప అదనపు రాబడికి పూనుకోవటం లేదు. తక్కువ వేతనాలకు పని చేసే నైపుణ్యం అంతగా అవసరం లేని కార్మికులు ఇప్పుడు అమెరికాకు అవసరమని తెలిసినప్పటికీ ట్రంప్ వారి మీద దాడి ప్రారంభించాడు. లా÷– ఏంజిల్స్ భగ్గుమనడానికి కారణం కూడా ఇదే. ఎప్పుడో ఏళ్ల క్రితం వచ్చి అమెరికానే తమదేశంగా స్థిరపడిపోయిన వారిపై దాడి చేయడం దారుణం కాక మరోటి కాదు. వారు లేకుంటే ఏ పనీ నడవదని ట్రంప్‌కు కూడా తెలుసు. అయితే మూర్ఖుల నిర్ణయాలకు ప్రజలు బలి కావాల్సి ఉంటుంద్న నిజానన్ని ట్రంప్ రుజువు చేస్తున్నారు.





## సికింద్రాబాద్ లో తెలంగాణా అమర వీరుల స్మారక స్థూపాన్ని నెలకొల్పాలి



**సికింద్రాబాద్(ఆకాంక్ష న్యూస్) :** సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో తెలంగాణా అమర వీరుల స్మారక స్థూపాన్ని నెలకొల్పేందుకు ప్రభుత్వ పరంగా ఏర్పాట్లు జరపాలని తెలంగాణా ఉద్యమకారుల సమితీ ఛైర్మన్ బండి రమేష్ సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సీతాఫలమండీ లోని ఎం.ఎల్.ఏ. క్యాంపు కార్యాలయంలో ఓ వినతి పత్రాన్ని పద్మారావు గౌడ్ కు అందించారు. తార్నాక - ఇఫ్లూ కూడలి మధ్య స్మారక స్థూపం ఏర్పాటుకు అనువైన స్థలం ఉందని బండి రమేష్ తెలిపారు. ఈ అంశం పై సంబంధిత అధికారులతో సంప్రదించి తగిన నిర్ణయం తీసుకుంటామని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు.

## అహ్మదాబాద్ విమాన ప్రమాదం.. మృత్యుంజయుడిని పరామర్శించిన ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** ఘోర విమాన ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడ్డ బ్రిటిష్ జాతీయుడు రమేశ్ విశ్వాస్ కుమార్ బుచర్వాడను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ) పరామర్శించారు%ూవీ వీశీఱ% ఎ గుజరాత్ రాష్ట్రంలో ఘోర విషాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అహ్మదాబాద్‌లో కూలిపోయిన ఎయిరిండియా బోయింగ్ ఏ-171లో ప్రయాణిస్తున్న 242 మందిలో 241 మంది మరణించారు. అయితే, ఒకే ఒక్కరు రమేశ్ విశ్వాస్ కుమార్ బుచర్వాడ త్రుటిలో ప్రమాదం నుంచి బయటపడి మృత్యుంజయుడిగా నిలిచారు. ప్రస్తుతం అతను అహ్మదాబాద్‌లోని సివిల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో నేడు రమేశ్‌ను ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పరామర్శించారు.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..ఏడుగురు మృతి



**బెంగళూరు(ఆకాంక్ష న్యూస్) :** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం చిత్తూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసి బస్సును కర్నాటకలోని హెూస్ కోట్ సమీపంలో గొట్టిపుర గేట్ వద్ద వేగంగా దూసుకొచ్చిన ఓ లారీ కంట్రోల్ తప్పి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా.. పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని హుటాహుటినా చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో చనిపోయిన వారిలో చిత్తూరు జిల్లా ఆళ్లమడుగుకు చెందిన నలుగురు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేద వధువు వివాహానికి 'వెస్సో' సహాయం

VESSO TRUST

**ఏలూరు(ఆకాంక్ష న్యూస్) :** పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు పట్టణ నివాసి చిట్టూరి సత్యనారాయణ(64) గత మూడు సంవత్సరాలుగా మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నారు. గత రెండు సంవత్సరాలుగా మూత్రపు బ్యాగ్ తోనే తమ జీవనం కొనసాగిస్తున్నారు. ఆయన సతీమణి కూడా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారి రెండవ మరియు మూడవ కుమార్తెలు ఇంట్లోనే బట్టలు కుట్టడం ద్వారా వచ్చిన స్వల్ప ఆదాయంపై ఆధార పడి జీవిస్తున్నారు.సత్యనారాయణ గారికి ముగ్గురు కుమార్తెలు. పెద్ద కూతురి వివాహం గతంలో జరిగింది. జూన్ 6న ఏలూరు పవర్ పేట రైల్వే గేట్ వద్ద ఉన్న శ్రీ కామాక్షి విశ్వబ్రాహ్మణ సత్రంలో జరిగిన రెండవ కుమార్తె సుజన పెళ్లికి ఆర్థిక సహాయం చేయమని స్థానిక నాయకులు అప్పలభక్తుల శివ కేశవరావు (శివశ్రీ) ద్వారా సత్యనారాయణ వెస్సో ట్రస్ట్ ను సంప్రదించారు. వెస్సో ట్రస్టీలు స్పందించి గౌరవ దాతల సహకారంతో వధువు తల్లి లక్ష్మి కి 45,000/-ల రూపాయలు అందజేశారు. ఈ సందర్భంగా వెస్సో ట్రస్ట్ అధ్యక్షులు బంగారు తాతారావు మాట్లాడుతూ అనారోగ్యంతో, ఇంటి అద్దె కూడా చెల్లించలేని స్థితిలో, తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సత్యనారాయణ కు ఆర్థిక సహాయం చేసి వధువు చి. సుజన ను ఆశీర్వదించిన గౌరవ దాతలకు పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదములు తెలిపారు.

## ప్రభుత్వ ప్రాథమిక పాటశాల దుబ్బలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం



**నిజామాబాద్(ఆకాంక్ష న్యూస్) :** సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం లో భాగంగా నిజామా బాద్ నార్త్ కాంప్లెక్స్ ప్రభుత్వ ఉన్నత పాటశాల ప్రధానోపాద్యయులు టీ. శ్రీనివాస్, ప్రాథమిక పాటశాల ప్రధానోపాద్యయులు ఆర్బివి రాజు దుబ్బలోని ప్రభుత్వ ప్రాథమిక పాటశాలలో సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమం లో ఉపాధ్యాయ బృందంమజూల మేడమ్, ఎలిజబెత్ రాణి మేడమ్,పార్వతమ్మ,సంతోషరాణి మేడమ్, అర్చన మేడమ్, లావణ్య, మోహనరెడ్డి చేత పిల్లలచే అక్షరాభ్యాస కార్యక్రమం లో పాల్గొన్నారు.

# రక్తదాత ప్రాణాలను కాపాడే వ్యక్తితో సమానం.":డాక్టర్ లిల్లీ మేరి

### ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం



**కొడంగల్(ఆకాంక్ష న్యూస్) :** అత్యవసర పరిస్థితుల్లో మరొకరి ప్రాణం పోసేది రక్తదానం. దీనిని కృత్రిమంగా ఉత్పత్తి చేయడం సాధ్యపడదు. రక్తదానం ఒక పవిత్ర కార్య%శీ%. పోయిన ప్రాణాలను మనము ఎలాగో తీసుకురాలేము. చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడే ప్రాణాలను ఒక్కోసారి సాటి మనిషి రక్తముతో కాపాడగల ము. ఇది రక్త దానము తోనే సాధ్యం. పుట్టినరోజులు, పెళ్లిరోజులు చేసుకుంటూ బంధుమిత్రులకు విందు ఇవ్వడం కంటే ఇలాంటి రోజులలో రక్తదానం చేయడం గొప్ప సంతృప్తినిస్తుంది. అయితే దురదృష్టవశాత్తు రక్తదానంపై ప్రజలలో ఇంకా సరైన అవగాహన లేదు. ఎన్నో అపోహలు వెంటాడుతున్నాయి. రక్తదానం చేస్తే లాభాలేంటి అనే అంశాలపై ప్రపంచ రక్తదాతల దినోత్సవ సందర్భంగా డాక్టర్ పూదోట లిల్లీ మేరి, ప్రిన్సిపల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, కొడంగల్ తో ప్రత్యేక కథనం. విధి వంచితులకు, క్షతగాత్రులకు, ప్రమాదం బారిన పడి అల్లాడే వారిని బతికించడానికి ఇవ్వాల్సింది రక్తం. ఒకప్పుడు రక్తదానం చేయాలంటే భయపడేవారు. ఇప్పుడు రక్తం ఇవ్వడానికి ముందుకు వస్తుండడం శుభపరిణామం. రాష్ట్రంలో ఎంతోమంది దాతలు రక్త నిధి కేంద్రాలను ఏర్పాటు చేసి అవసరమైన వారికి రక్తం అందించి ఎంతో మంది అభాగ్యుల ప్రాణాలు నిలుపుతున్నారు. ప్రాణం నిలపడానికి అవసరమైన ఈ రక్తం గురించి చాలామందికి తెలియదు. అసలు రక్తదానం ఎందుకు చేయాలి. రక్తదానం చేయాలంటే ఎవరిని సంప్రదించాలి.

#### ఎవరు రక్తదానం చేయాలి :

18 నుంచి 65 సంవత్సరాల లోపు ఉండి 45 కిలోల కంటే బరువు ఎక్కువగా ఉన్న ఆరోగ్యవంతులు రక్తదానం చేయవచ్చు. గతంలో రక్తదానం చేసి ఉంటే మూడు నెలల తర్వాత తిరిగి చేయవచ్చును. రక్తపోటు సాధారణ స్థితిలో ఉన్నవారు, గుండె జబ్బులు లేనివారు రక్తదానం చేయవచ్చును. రక్తదానం చేసినా చేయకపోయినా ప్రతి మనిషి రక్త%శీ%లోని జీవకణాల జీవిత కాలము నాలుగు నెలలు మాత్రమే. రక్తదానం చేసిన తర్వాత 24 గంటల లోగా ప్లాస్మా ఏర్పడుతుంది. నాలుగు వారాల్లోగా జీవ కణాలు ఏర్పడతాయి.

#### రక్త మార్పిడి ఎందుకు?

రక్తంలో భాగంగా ఉండే కొన్ని అంశాలు తగ్గిన, శరీరంలో తగినంత రక్తం లేకపోయినా, రక్త మార్పిడి అవసరము. మన రాష్ట్రంలో అత్యవసరంగా రక్తాన్ని ఎక్కించాల్సిన కేసులు ఎక్కువ కావడం గమనార్హం. రక్తం అవసరమైన వారి సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. రోడ్డు ప్రమాదాలలో గాయపడిన వారికి, రక్తహీనతతో బాధపడే వారికి, సికిల్ సెల్, తల సేమియా వంటి జన్యు సంబంధ వ్యాధులకు గురైనప్పుడు రక్తమార్పిడి తప్పనిసరి. తల సేమియా వ్యాధిగ్రస్తులకు హిమోగ్లోబిన్ తయారయ్యే జన్యువులు లోపిస్తాయి. వీరికి ప్రతి 20 రోజులకోసారి రక్త మార్పిడి జరగాలి. సికిల్ సెల్, అనీమియా వ్యాధిగ్రస్తులకు ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలోకి మారిపోయి రక్తప్రసరానికి ఆక్సిజన్ సరఫరాకు పనికి రాకుండా పోతాయి. కొంతమంది స్త్రీలలో ప్రసవం తర్వాత పోస్ట్ పార్టం హేమరేజ్ అనే సమస్య వస్తుంది. ఫలితంగా రక్తస్రావ సమస్యకు గురవుతారు. అలాంటి వారికి రక్తమార్పిడి అవసరం అవుతుంది.

#### రక్తము రకాలు:

రక్తంలో నాలుగు గ్రూపులుంటాయి. ఏ, బి, ఓ, ఏబి ఆర్హెచ్ పాజిటివ్ లు, నాలుగు ఓ ప్లస్, ఎ ప్లస్, బి ప్లస్, ఏ బి ప్లస్ లు ఉంటాయి. ఆర్ హెచ్ నెగిటివ్ లు నాలుగు ఓ మైనస్, ఏమైనస్, బి మైనస్, ఏ బి మైనస్ గ్రూపుల వారు. నాలుగు గ్రూపుల వారికి రక్తదానం చేసే అవకాశం ఉంటుంది. దేశ జనాభాలో రక్తము 1%ఒకటి నుంచి1.5% వరకు అవసరము అవుతుందని సర్వే రిపోర్ట్ లు తెలియజేస్తున్నాయి. కానీ రక్త సేకరణ మాత్రము 0.80% వరకు రక్తాన్ని సేకరిస్తున్నారు. అంటే మన జనాభాలో 0.20% మంది రక్తం దొరకగా మృత్యువాత పడుతున్నారని గణాంకాలు చెప్తున్నాయి. దీనిని బట్టి రక్తదాన ఆవశ్యకత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశ జనాభాలో ప్రతి వంద మందిలో 400 నుంచి 450 మందికి ఓ ప్లస్ రక్తము, 200 నుంచి 250 మందికి ఏ ప్లస్ రక్తము, 200 నుంచి 250 మందికి బి ప్లస్ రక్తము, 70 నుంచి 80 మందికి ఏబి ప్లస్ రక్తము, ఒక శాతం చొప్పున నెగటివ్ గ్రూప్ రక్తము ఉంటుంది.

#### ఎర్ర రక్త కణాలు:

రక్తంలో 40- 45 శాతం ఉంటాయి. ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని కణాలన్ని%శీ%టికీ ఆక్సిజన్ తీసుకువెళ్తాయి. తిరిగి కార్బన్ డయాక్సైడ్ ను ఊపిరితిత్తులకు మోసుకు వస్తాయి. రక్తము నుంచి వేరు చేసిన తర్వాత 30-35 రోజుల వరకు నిల్వ ఉంటాయి. వ్యాధులు రాకుండా రక్షించేది మాత్రం తెల్ల రక్త కణాలే.

#### ప్లాస్మా:

రక్తంలో 55 నుంచి 60 శాతం వరకు ప్లాస్మాకణాలు ఉంటాయి. రక్తంలో ఉండే ద్రవరూపము ప్లాస్మా. ప్లాస్మాలో 92 శాతం నీరు, ఏడు శాతం ప్రోటీన్లు, ఒక శాతం ఖనిజాలు ఉంటాయి. దీని రక్తం నుంచి వేరు చేసిన తర్వాత ఒక ఏడాది వరకు నిల్వ చేయవచ్చు.

#### ప్లెట్లెట్స్ (రక్త కణాలు):

రక్తము గడ్డ కట్టడానికి, వీటి పరిమాణం తగ్గితే రక్తస్రావాన్ని ఆపడం కష్టం. ప్లేట్లెట్స్ కణాలను తీసిన రోజే అవసరమైన వారికి ఎక్కిస్తారు.

#### క్రయోప్రెసిపిటెట్ (ఫ్యాక్టర్-8):

హిమోఫిలియా ఉన్నవారికి దీనిని ఎక్కిస్తారు. దీనికి గడ్డ కట్టించే స్వభావం ఉంటుంది.

#### రక్తదానం చేయాలనుకుంటే :

హైదరాబాద్ నగరంలో సుమారు 150 కి పైగా రక్తనిధి కేంద్రాలున్న రక్తనిది సేకరణకు ప్రభుత్వ ఆసుపత్రులలో గల రక్తనిధి కేంద్రాలకుగాని, రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రాలకుగాని, అనుమతి పొందిన రక్త నిధి కేంద్రాలకు మాత్రమే ప్రభుత్వం సేకరణకు అనుమతినిచ్చింది..

#### రక్తం అవసరమైతే:

రక్తం అవసరమైన వ్యక్తులు నగరంలోని అనుమతి పొందిన రక్తం కేంద్రాల నుంచి రక్తాన్ని తీసుకోవాలి. ప్రభుత్వ, రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు ఉచితంగానూ మిగిలిన వ్యక్తులకు ఏ గ్రూపు రక్తం అయినా 1050 రూపాయలకు ఇస్తారు. డాక్టర్ పూదోట లిల్లీ మేరి, ప్రిన్సిపల్, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, కొడంగల్ యందు విధులు నిర్వహిస్తూ, తన విధి నిర్వహణతో పాటు పలు స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. లిల్లీ మేరి వృత్తి బోధన, ప్రవృత్తి రక్తదానం. ఆమె 1994 నుండి నేటి వరకు 31 సార్లు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం జరిగింది. ఆమె ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేయునప్పుడు గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో, ప్రసవ వేదనలో బాధపడుతున్నప్పుడు ఆ సమయంలో రక్తం ఇచ్చేవారు అందుబాటులో లేకపోవటంతో వారు మృతి చెందుతూ ఉండేవారు. ఆ ఘటన లిల్లీ మేరిని ఎంతగానో కదిలించింది. ఆపదలో ఉన్న వారికి రక్తం అవసరమని చిన్న వయసులోనే బలంగా నాటుకుపోయిన ఈ ఘటన రక్తదానానికి ఆమెను పురిగోలిపేలా చేసింది. మొదటిసారిగా 1994లో గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి యందు స్వచ్ఛందంగా రక్తదానం చేసిన ఆమె నేటి వరకు తన సేవా కార్యక్రమాన్ని ఆపలేదు. ఒక్కోమారు ఏడాదిలో రెండు సార్లు రక్తదానం చేసిన సందర్భాలు ఉన్నాయి. ప్రభుత్వ రక్తనిధి కేంద్రాలలో ఎక్కువ మార్లు రక్తదానం చేసినట్లు ఆమె తెలిపారు. అయితే ఆపదలో ఉన్న వారికి రక్తం అందించిన సందర్భాలలో వారి నుంచి దీవెనలను తీసుకోవడం తనకు గర్వంగా ఉంటుందని డాక్టర్ లిల్లీ మేరి చెబుతున్నారు. దీనిలో భాగంగా రోగులకు అవసరమయ్యే రక్తం కొరతను నివారించేందుకు గాను రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రము మరియు ప్రభుత్వ రక్తనిధి కేంద్రాల సహకారముతో కళాశాలలు, యువజన సంఘాలతో పాటు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల యందు స్వచ్ఛంద రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నది. వారితో రక్తదానం చేయించడమే కాకుండా తాను కూడా స్వచ్ఛందంగా 31 సార్లు రక్తదానం చేసింది.

#### రక్తదానం వల్ల ఉపయోగాలు ఎన్నో - డాక్టర్ లిల్లీ మేరి :-

1) రక్తదానం చేసిన ప్రతిసారి ముగ్గురు బాధితుల ప్రాణాలను మనం కాపాడినట్లే. (2) తరచూ రక్తదానం ఇవ్వటం వలన క్యాన్సర్ ముప్పు తప్పుతుంది. (3) సంవత్సరంలో ఒక్కసారైనా ఇస్తే గుండెపోటు ముప్పు 88% మేర తగ్గించుకోవచ్చు . (4) రక్తంలో ఉండే అధిక శాతం ఇనుము వల్ల రక్తనాళాలు పూడికపోయి గుండెపోటు ముప్పు ఉంటుంది. రక్తదానముతో ఈ ఇనుము నిల్వలు తగ్గుతాయి. తద్వారా కాలేయము ఆరోగ్యముగా బాగుంటుంది. . (5) ఎముక మజ్జ కొత్త ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేస్తుంది. (6) ఒక్కసారి రక్తదానం చేయడం వలన 650 కిలో క్యాలరీలు తగ్గినట్లే. ఈ ప్రక్రియ ద్వారా శరీర బరువు అదుపులోకి వస్తుంది. (7) ఆరోగ్యంతో పాటు మానసిక ఆనందం కలుగుతుంది. ఇది వెలకట్టలేని సంతృప్తినిస్తుంది. కావున ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ స్వచ్ఛంద రక్తదానం చేయవలని కోరారు.

#### రక్తం ఇవ్వకున్నా ఎర్ర రక్త కణాలు తగ్గిపోతాయి :-

ఎర్ర రక్త కణాల (%=దీజ%) సగటు జీవిత కాలము 110 మొదలు 112 రోజులు. ఈ కాల వ్యవధి అనంతరం అవి శరీరంలో నశించిపోతాయి. వాటి స్థానములో కొత్తవి చేరతాయి. ఈ క్రమ విధానములో ప్రతి మానవునిలో ప్రాణం ఉన్నంత వరకు ఈ ప్రక్రియ జరుగుతూనే ఉంటుంది. కాబట్టి మీరు రక్త దానము చేయకపోయినా ఎర్ర రక్త కణాలు నశించిపోతాయి. కాబట్టి రక్తదానం చేయడమే మంచిది.మన శరీరంలో సహజంగా నశించిపోయేలా చేయటం కంటే రక్తదానం చేసి ప్రాణదాతలు కండి అని పిలుపునిచ్చారు.

#### డాక్టర్ లిల్లీ మేరి కి 14 న రాష్ట్ర గవర్నర్ అవార్డు:

ప్రపంచ రక్త దాతల దినోత్సవం సందర్భంగా జూన్ 14 శనివారం నాడు రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణు దేవ్ వర్మ గారి చేతుల మీదుగా రాజ్ భవన్ యందు డాక్టర్ లిల్లీ మేరి కు స్వచ్ఛంద రక్తదాత అవార్డును అందుకోబోతున్నారు

# మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు

### 16న ఉదయం పది గంటలకు విచారణకు హాజరుకావాల్సిందిగా ఆదేశం



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఏసీబీ (%ూజదీ%) నోటీసులు ఇచ్చింది. ఫార్ములా ఈ రేసు కేసుకు సంబంధించి ఈనెల 16న (సోమవారం) ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాల్సిందిగా ఏసీబీ నోటీసుల్లో పేర్కొంది. అయితే ఈ కేసుకు సంబంధించి గత నెల మే 28న విచారణకు హాజరుకావాల్సిందిగా మే 26వ తేదీన కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు పంపింది. అయితే ఆ సమయంలో కేటీఆర్ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఈ నేపథ్యంలో విదేశీ పర్యటన ముగిసిన తర్వాత విచారణకు హాజరువుతానని ఏసీబీకి మాజీ మంత్రి సమాచారం ఇచ్చారు. దానికి అంగీకారం తెలిపిన ఏసీబీ.. తాజాగా మరోసారి కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసింది.కాగా.. ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి గతంలో ఒకసారి కేటీఆర్ ఏసీబీ, ఈడీ ముందు విచారణకు హాజరైన విషయం తెలిసిందే. జనవరి 6న లాయర్లతో కలిసి ఏసీబీ విచారణకు వెళ్లిన కేటీఆర్‌ను అధికారులు అనుమతించకపోవడం తిరిగి వెళ్లిపోయారు. తిరిగి మరోసారి జనవరి 8న ఏసీబీ విచారణ హాజరయ్యారు మాజీ మంత్రి. దీంతో దాదాపు 7 గంటల పాటు ఆయనను ఏసీబీ విచారించింది. జనవరి 9న మరోసారి విచారణకు పిలవగా.. కేటీఆర్ సమయం కోరారు. ఇక మున్సిపల్ శాఖ కార్యదర్శి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్ఎన్ రెడ్డిలను ఏసీబీ విచారించింది.బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో హైదరాబాద్ వేదికగా ఫార్ములా ఈ రేస్ నిర్వహించారు. అయితే ఇందులో రూ.55 కోట్లు దుర్వినియోగం జరిగినట్లు ఏసీబీ కేసు నమోదు చేసింది. ఈ కేసులో ముగ్గురు పేర్లను ఏసీబీ ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసింది. ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, ఏ3గా హెచ్ఎండీఏ మాజీ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిల పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చింది ఏసీబీ. ఆ తరువాత జనవరిలో ముగ్గురిని వివిధ తేదీల్లో విచారించిన ఏసీబీ.. ఫార్ములా ఈ రేస్ కేసుకు సంబంధించి కొంత సమాచారాన్ని సేకరించింది. మరోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంటుందని కూడా ఏసీబీ చెప్పింది. అలాగే గ్రీన్‌కో ఏస్ నెక్స్ట్‌జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్‌కు కూడా ప్రశ్నించింది. అయితే వీరి ముగ్గురిని విచారించి మూడు నెలలు గడిచి పోయింది కూడా. ఇప్పుడు తాజాగా రెండో సారి కేటీఆర్‌ను విచారించాలని ఏసీబీ నిర్ణయించింది. అందులో భాగంగానే కేటీఆర్‌కు నోటీసులు జారీ చేసి ఈనెల 16న విచారణకు రావాల్సిందిగా నోటీసుల్లో పేర్కొంది.



# అక్రిడేషన్ పాలసీకి ఇంత జాప్యమేల...?

- వెంటనే ప్రకటించి అర్హులందరికీ వెంటనే కార్డులివ్వాలి....
- జర్నలిస్టుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలుస్తాం....
- పాత చట్టాలను సవరించాలి...
- డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్...



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** తెలంగాణలో జర్నలిస్టులకు అక్రిడేషన్లు ఇచ్చే విధివిధానాలను వెంటనే ప్రకటించి , అర్హులైన అందరికీ వీలైనంత త్వరగా కార్డులు ఇవ్వాలని వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ డిమాండ్ చేశారు. అక్రిడేషన్ పాలసీని సరళీకృతం చేయాలని సూచించారు. ఏడాది నుంచి ఈ అంశాన్ని తేల్చకపోవడం సమంజసం కాదన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా శుక్రవారం హైదరాబాద్ లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పటిష్ఠమైన ఇన్సూరెన్స్ , ఆసుపత్రులలో ఉచిత చికిత్స, ఆరోగ్య కార్డులు తదితర అంశాలతో పాటు తెలంగాణ పాత్రికేయుల సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి త్వరలో వినతిపత్రం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రైళ్లు, విమానాల టికెట్లలో జర్నలిస్టులకు రాయితీ ఇవ్వాలని, టోల్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని తాము పోరాడుతున్నట్లు తెలిపారు. సెప్టెంబరులో దిల్లీలో భారీ ర్యాలీ నిర్వహించి, ఈ అంశాలపై ప్రధాని మోదీకి విన్నవిస్తామని చెప్పారు. జర్నలిజం ప్రింట్ మీడియా నుంచి మొదలై వివిధ రూపాలకు విస్తరించినందున పాత చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందన్నారు. ఆ ప్రక్రియలో పాత్రికేయులకూ భాగస్వామ్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేలు, మంత్రులు, గెజిటెడ్ అధికారులకు కల్పించే సౌకర్యాలను జర్నలిస్టులకు వర్తింపజేయాలన్నారు. జర్నలిస్టులు నిష్పక్షపాతంగా ఉంటేనే సమాజంలో వారిపట్ల గౌరవం పెరుగుతుందన్నారు. వారు దేశహితం కోసమే పని చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో పాత్రికేయుల పాత్ర కీలకమని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వాలకు మధ్య వారధిగా పనిచేస్తున్నా సామాజిక అంశాల్లో జర్నలిస్టులు వెనకబడి ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారిలో ఐక్యత లేకపోవడమే అందుకు కారణమన్నారు. ఆర్థిక భద్రత, ఉద్యోగ భద్రత తదితర అంశాల్లో వెనకబడి జర్నలిస్టులు వెనకబడి ఉన్నారని, దేశమంతా ఇదే స్థితి ఉందన్నారు. వారి పక్షాన పోరాడేందుకే వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) ఆవిష్కరించిందన్నారు. ప్రస్తుతందేశంలోని 16 రాష్ట్రాల్లో పాత్రికేయుల సంక్షేమం కోసం కృషి చేస్తోందని, దేశంలోని అన్ని రాష్ట్రాలలో తమ సభ్యులు ఉన్నారని సంజయ్ ఉపాధ్యాయ తెలిపారు. జాతీయ స్థాయిలో బీఎంఎస్ కు అనుబంధంగా పని చేస్తున్నామని, త్వరలో నేపాల్ కు కూడా విస్తరించబోతున్నట్లు వెల్లడించారు.

# ఓదెల యువనాయకుడికి గౌరవ డాక్టరేట్


**ఓదెల రిపోటర్ (మహేందర్) ఆకాంక్ష న్యూస్) :** సామాజిక సేవే లక్ష్యంగా జీవితాన్ని అంకితం చేసిన ఓదెల మండలం కొలనూరు గ్రామానికి చెందిన మాటూరి రాజా రత్నంకు అగ్ర విశ్వవిద్యాలయం 'డే స్ప్రింగ్ తియోలాజికల్ యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్, %ఖూూ%' గౌరవ డాక్టరేట్ ను ప్రదానం చేసింది. బుధవారం సాయంత్రం హైదరాబాద్ అబిడ్స్‌లోని సూర్య లాక్ కాంప్లెక్స్ లో ఈ అవార్డు ఆయనకు బహూకరించారు. 1990లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షుడిగా రాజా రత్నం నాయకత్వ పయనాన్ని ప్రారంభించి, మండల, డివిజన్, జిల్లా స్థాయిలలో పదవులు అలంకరించారు. ప్రస్తుతం రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నారు. తొలిదశలో గ్రామాల వరకూ సైకిల్‌పై తిరుగుతూ అంబేద్కర్ సిద్ధాంతాలను ప్రచారం చేసిన రాజా రత్నం, ఓదెల మండలంలోని పలుచోట్ల విగ్రహాలు ఏర్పాటు చేయించడంలో కీలకపాత్ర వహించారు. నాటి మంత్రి పి. జనార్దన్ రెడ్డి చేతుల మీదుగా కొలనూరు, ఓదెల, పొత్కపల్లి గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణలు చేయించి ఉద్యమ స్ఫూర్తికి నిలువెత్తు ఉదాహరణగా నిలిచారు. సామాజిక న్యాయం కోసం మంథని, హుస్నాబాద్, కొలనూరు, సుల్తానాబాద్ ప్రాంతాల్లో జరిగిన సంఘటనల్లో బాధితుల తరపున పోరాడారు.



రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చుండూరు, కుప్పం, ట్యాంక్ బండ్ ఉద్యమాల్లో భాగస్వామిగా వందల మందితో రైలు ప్రయాణాలు చేసి ఉద్యమం నడిపించారు. 1991లో బాబాసాహెబ్ అంబేద్కర్ శతజయంతి ఉత్సవాల్లో ఉమ్మడి జిల్లా కమిటీ మెంబర్‌గా కొనసాగిన రాజా రత్నం, అప్పటి డివిజన్ కేంద్రంలో అంబేద్కర్ జీవితం గురించి అనర్గళంగా ప్రసంగించి ప్రజాప్రతినిధుల ప్రశంసలు పొందారు. 1993లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభించిన అక్షరాభ్యాస కార్యక్రమాల్లో గ్రామాలను దత్తత తీసుకొని, వాలంటరీ సెంటర్ల ద్వారా అక్షరజ్యోతి వెలిగించారు. ఈ సేవలకుగాను అప్పటి కలెక్టర్ బన్వర్ లాల్ చేత 'బెస్ట్ వాలంటరీ' ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ప్రతీవేళ ఏప్రిల్ నెలలో అంబేద్కర్, ఫూలే, బాబు జగ్జీవన్ రాం జయంతులను 'మహనీయుల ఉత్సవ సభ'గా నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం నింపుతున్నారు. అంతేగాక, డిసెంబర్ 1న ఎయిడ్స్ నిరోధక దినోత్సవం సందర్భంగా '3కే రన్' నిర్వహించి యువతకు అవగాహన కల్పించారు. డిసెంబర్ 6న అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నాలుగు మండలాల విద్యార్థులకు క్రీడలు, క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి వారిని సత్కరించారు. అంబేద్కర్, ఫూలే, సావిత్రీబాయి ఫూలే, మదర్ థెరిస్సా, బుద్ధుడి జయంతులు, వర్ధంతులే కాక, మహిళా దినోత్సవం సందర్భంగా సైతం 10–12 కార్యక్రమాలు నిర్వహించడం మాటూరి ప్రత్యేకత. పోస్టల్ శాఖలో చిన్న ఉద్యోగం చేస్తూనే తన వ్యక్తిగత జీవితాన్ని పక్కనబెట్టి సమాజాన్ని మార్చే అంబేద్కర్ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన మాటూరి రత్నం నిజమైన మార్గదర్శి అని అంటున్నారు ప్రజలు. ఆయన సేవలను గుర్తించి అమెరికా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ఇవ్వడం గర్వకారణమని గ్రామస్తులు పేర్కొన్నారు.

### మాటూరి రత్నం కు డాక్టరేట్ లభించడం పట్ల పలువురు వ్యక్తుల అభినందనలు....

తాడూరి కర్ణాకర్, ఆకుల మహేందర్, పల్లె కనకయ్య, మాటూరి వెంకటస్వామి, గద్ద శంకర్, పూరెళ్ల స్వప్నగౌడ్, సాతూరి అనిల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఈ పురస్కారం నేటి యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని వారు తెలిపారు. మాటూరి రత్నం జీవితమే ఒక ఉద్యమ గ్రంథంగా పాఠాలకూ, ఉద్యమకారులకూ మార్గదర్శకంగా నిలుస్తుందనే అభిప్రాయాన్ని వారు వెలిబుచ్చారు.




# ప్రైవేట్ బడులు వద్దు...

- ప్రభుత్వ బడులు ముద్దు
- స్పీచ్ తో అదరగొట్టిన విద్యార్థి...

**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్)** హైదరాబాద్ తిరుమలగిరి బొల్లారం, త్రిశూల్ పార్క్, గవర్నమెంట్ హై స్కూల్ లో విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశం ను ప్రభుత్వ ఆదేశాల మేరకు స్కూల్ హెడ్మాస్టర్ విక్రమాదిత్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా శాఖ చైర్మన్ మరియు సి. సి. ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమ్ రెడ్డి, సి.సి. ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మరియు రెడ్ క్రాస్ హైదరాబాద్ జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు ఏవి రావు, సామాజికవేత్త కొత్త కృష్ణవేణి, రిటైర్డ్ హిందీ పండిట్ కళావతి ముఖ్య అతిథులుగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఓ విద్యార్థి లేచి ప్రసంగిస్తూ.... ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అని తెలుపుతూ, మా పాఠశాలలో అన్ని ఉచితలే, ప్రత్యేకంగా విద్య అనేది ఫ్రీ.. ఫ్రీ.. ఫ్రీ..



అంతేకాకుండా సైన్స్ ల్యాబ్, లైబ్రరీ, డిజిటల్ తరగతి గదులు, ఇంకా ఎన్నో ప్రత్యేకతలతో, బిఈడి క్వాలిఫై కలిగిన మరియు ప్రభుత్వం నియమించిన టీచర్ల చేత బోధన జరుగుతుంది. ప్రైవేట్ పాఠశాలలో ఉన్న టీచర్ల కంటే నాణ్యమైన విద్యను బోధించే టీచర్లు మా పాఠశాలలో మాకు బోధిస్తున్నారు. కాబట్టి ఇక్కడికి విచ్చేసిన అందరి తల్లిదండ్రులకు ఇచ్చే సలహా ఏమనగా మీరు టైం వేస్ట్ చేసుకోకుండా మా పాఠశాలలో మీ పిల్లలను చేర్పించి ప్రభుత్వం కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. మరియు విద్యార్థులు కూడా ఈ మంచి అవకాశాన్ని దుర్వినియోగం చేసుకోకుండా టీచర్లు బోధించే విద్యను మరియు మా పాఠశాల సౌకర్యాలను వినియోగం చేసుకోవాలని తెలియజేస్తున్నాను. కావున మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి విద్యార్థుల సంఖ్యా బలాన్ని పెంచాలని కోరుకుంటూ ఈ అవకాశం ఇచ్చిన మా స్కూల్ హెడ్మాస్టర్ సార్ కి కృతజ్ఞతలు తెలుపుతూ ముగిస్తున్నాను. అని, చాలా అద్భుతంగా ప్రభుత్వ పాఠశాల యొక్క పురోగతిని ప్రభుత్వం కల్పించే మంచి సౌకర్యాలను మంచి విద్యను నాణ్యమైన టీచర్లను గౌరవిస్తూ ప్రభుత్వం కల్పించే సౌకర్యాలను వినియోగించుకుని, ప్రభుత్వ బడులలో విద్యార్థుల సంఖ్యాబలాన్ని పెంచాలని, ఆ విద్యార్థి మాట్లాడిన మాట తీరును అక్కడికి వచ్చిన వారందరినీ అబ్బురపరిచేలా చేసింది. ఆ విద్యార్థి పేరే కె.వి సత్యనారాయణ, తొమ్మిదవ తరగతి. తదనంతరం ప్రభుత్వం నిర్వహించే ఎన్ ఎంఎంఎస్ పరీక్షలలో ఉత్తీర్ణులైన ప్రభుత్వం కల్పించే స్కాలర్షిప్ కు ఎంపికైన 9వ తరగతి శారద, 10వ తరగతి ఆమన్ వీరిని స్కూల్ హెడ్మాస్టర్ మరియు టీచర్లు అభినందించారు. రెడ్ క్రాస్, హైదరాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో పిల్లలకు నోట్ బుక్ లు, స్టేషనరీ మామిడి భీమ్ రెడ్డి, ఏవి రావు, కళావతి, హెడ్మాస్టర్ ప్రభాకర్, రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. భీమ్ రెడ్డి గారు మాట్లాడుతూ మొదట ప్రభుత్వ అధికారులు, రాజకీయ ప్రతినిధులు అందరు కూడా తమ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించి ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అప్పుడే అందరూ కూడా ప్రభుత్వ బడులలో చదువుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు పాఠశాల టీచర్లు అందరూ కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి కుంటుపడిన విద్యా వ్యవస్థ...



**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి రాష్ట్రంలో వ్యవసాయం మాత్రమే కాదు విద్యా వ్యవస్థ కూడా కుంటుపడిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ (%ఖు=%) విమర్శించారు. వ్యవసాయ రంగం పట్ల నిబద్ధత లేదని, విద్యావ్యవస్థ పట్ల బాధ్యత లేదని మండిపడ్డారు. వానాకాలం సీజన్ మొదలవుతున్నా రైతుభరోసా అమలు విషయంలో ప్రణాళిక లేదని దుయ్యబట్టారు. పాఠశాలలు ప్రారంభమైనా పాలకులు నిర్లక్ష్యం వీడడం లేదని చెప్పారు. అరకొర రుణమాఫీ, ఆచూకీ లేని రైతు భరోసా, అందని రైతుబీమా, ప్రాజెక్టులు పడావు పడ్డాయని విమర్శించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో పండగలా మారిన వ్యవసాయం, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తిరోగమనం వైపు పయనిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. వెయ్యికిపైగా సంక్షేమ గురుకులాల ఏర్పాటుతో ఎవరెస్టు శిఖరం అధిరోహించిన తెలంగాణ విద్యావ్యవస్థ ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అవస్థలు ఎదుర్కొంటున్నదని చెప్పారు.

# ఈ నెల 18 నుంచి సీపీగెట్ రిజిస్ట్రేషన్లు




**హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) :** రాష్ట్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్ పోస్ట్ గ్రాడ్యుయేట్ ఎంట్రెన్స్ టెస్ట్ (సీపీగెట్) 2025 నోటిఫికేషన్ విడుదల కానుంది. మధ్యాహ్నం 3: 30 గంటలకు ఉన్నతవిద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వుడిత్యాల బాలకిష్టారెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం కుమార్ తదితరులు ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంకాం వంటి కోర్సుల్లోని సీట్లను సీపీగెట్ ద్వారా భర్తీచేస్తున్న విషయం తెలిసిందే. ఈ సారి కూడా సీపీగెట్ నిర్వహణ బాధ్యతలను ఉస్మానియా యూనివర్సిటీకే అప్పగించారు. ప్రొఫెసర్ ఐ పాండు రంగారెడ్డి సీపీగెట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు.

### మూడు విడతల్లో..

పీజీ కోర్సుల్లోని సీట్లను ఈ సారి మూడు విడతల్లో భర్తీచేస్తారు. మొదటి విడత రిజిస్ట్రేషన్లు ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్నాయి. అదే రోజు సీపీగెట్‌కు సంబంధించిన ఇన్ఫర్మేషన్ బ్రోచర్‌ను సైతం అధికారులు విడుదల చేస్తారు. ఇది వరకు వికలాంగులకు 30 సీట్లకు ఒక సీటును కేటాయించే వారు. కానిప్పుడు ఐదు శాతం రిజర్వేషన్‌ను వర్తింపజేయనున్నారు. ఉమ్మడి కోటా ప్రవేశాల గడువు ముగియడంతో 15 శాతం ఏపీ కోటా సీట్లకు కోతపడనుంది. ఇక నుంచి ఏపీ విద్యార్థులు నాన్‌లోకల్ కోటాలోనే సీట్లకు పోటీపడొచ్చు. రాష్ట్రవ్యాప్తంగా 8 వర్సిటీల్లోని పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ కలుపుకుంటే మొత్తంగా 50 వేలకు పైగా సీట్లున్నాయి. వీటిలో ఏటా 22 నుంచి 23 వేలు మాత్రమే నిండుతున్నాయి. దాదాపు 27 వేల సీట్లున్నా విద్యార్థులువెవరు చేరడంలేదు. దీంతో ఆయా సీట్లన్నీ ఖాళీగా ఉంటున్నాయి.

# పశ్చిమాసియాలో కమ్ముకున్న యుద్ధమేఘాలు



**న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్‌పై ముందస్తు దాడులకు దిగింది. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. శుక్రవారం ఉదయం దేశ రాజధానిలో పేలుళ్ల శబ్ధం వినిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారని ఇరాన్ అధికార మీడియా వెల్లడించింది. దీనికి ప్రతిగా టెహ్రాన్ సైతం ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగింది. డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ దాడులను ఇజ్రాయెల్ సమర్థవంతంగా తిప్పికొడుతోంది. ఇక ఇజ్రాయెల్ దాడులతో అప్రమత్తమైన ఇరాన్ తన గగనతలాన్ని మూసి వేసిన విషయం తెలిసిందే. దీంతో విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. న్యూయార్క్ నుంచి ఢిల్లీకి, ఢిల్లీ, ముంబై నుంచి లండన్, న్యూయార్క్‌కు వెళ్లే అనేక విమానాలు ప్రభావితమయ్యాయి. పలు విమానాలను దారిమళ్లించగా.. మరికొన్ని వెనక్కి తిరిగివస్తున్నాయి. దాదాపు 16 ఎయిర్ ఇండియా విమానాలను దారి మళ్లించినట్లు ఎయిర్‌లైన్స్ తెలిపింది.

# ఇరాన్‌పై ముందస్తు దాడులు.. విమానం వెనక్కి తిరిగి వచ్చిన ఎయిర్ ఇండియా

**ముంబై(ఆకాంక్ష న్యూస్) :** ముంబై నుంచి లండన్ బయల్దేరిన ఓ ఎయిర్ ఇండియా విమానం వెనక్కి తిరిగొచ్చింది. ఫ్లైట్‌రాడార్24 ప్రకారం.. ఎయిర్ ఇండియాకు చెందిన విమానం ఇవాళ తెల్లవారుజామున 5:39 గంటల సమయంలో ముంబై నుంచి లండన్‌కు బయల్దేరింది. దాదాపు మూడు గంటలు ప్రయాణించిన తర్వాత ముంబైకి తిరిగి వచ్చింది. దీనిపై ఎయిర్ ఇండియా స్పందించింది. ఇజ్రాయెల్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తన గగనతలాన్ని మూసి వేసిన విషయం తెలిసిందే. దీంతో విమానం వెనక్కి తిరిగి వచ్చినట్లు ఓ ప్రకటనలో వెల్లడించింది. పలు విమానాలను దారి మళ్లించినట్లు పేర్కొంది. ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్‌పై ముందస్తు దాడులకు దిగింది. అణు కర్మాగారాలు, సైనిక స్థావరాలే లక్ష్యంగా టెహ్రాన్‌పై బాంబుల వర్షం కురిపించింది. ఇరాన్ అణు స్థావరాలే లక్ష్యంగా దాడి చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. టెహ్రాన్ ప్రతిదాడులు చేసే అవకాశం ఉండటంతో దేశంలో అత్యవసర పరిస్థితులను ప్రకిటించింది. తాజా దాడుల నేపథ్యంలో అప్రమత్తమైన ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. కాగా, గురువారం మధ్యాహ్నం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు.

# ఇంటిలోఎందరుపిల్లలు ఉన్నఅందరికి తల్లికి వందనం పథకం



**తనకల్లు, (ఆకాంక్ష న్యూస్) :** తనకల్లు మండల కేంద్రంలో శుక్రవారం తల్లికి వందనం పథకంలో లబ్ధి పొందిన తల్లులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి లోకేష్, మరియు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, చిత్రపటాలకు జాతీయ రహదారిపై పాలాభిషేకం చేసి తమ కృతజ్ఞతను చాటుకున్నారు. ఈ సందర్భంగా 237, బూత్ కమిటీ కన్వీనర్ చాకివేల శిరీష,మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ అమ్మ ఒడి కార్యక్రమాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చి కేవలం ఒక్కరికి మాత్రమే అమ్మ ఒడి అమలు చేసి తాము ఇచ్చిన హామీని విస్మరించిన ప్రభుత్వానికి బుద్ధి చెప్పి ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కుటుంబంలో ఎంత మంది ఉన్నా తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం తల్లుల ఖాతాలలో డబ్బులు జమ చేసిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని అంతేకాకుండా ప్రభుత్వం ఇచ్చిన హామీలలో భాగంగా ఒక్కో పథకానికి సంబంధించి హామీలని అమలు చేస్తోందని, హామీలలో భాగంగా పేదలకు సంవత్సరానికి మూడు సిలిండర్లు పంపిణీ చేస్తుందని, అదేవిధంగా తల్లికి వందనం విజయవంతంగా అమలు చేసిందని, మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని రాబోయే ఆగస్టు నెలలో ప్రారంభం చేస్తోందని, అదేవిధంగా పేదల పక్షాన కూటమి ప్రభుత్వం ఉంటుందని, ప్రతిక్షణం పేదల కోసం పాటుపడే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్షల మేరకు ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అదేవిధంగా ఆయనకు చేదోడు వాదోడుగా జనసేన, బీజేపీ, పార్టీలు వెన్ను దన్నుగా ఉండడం మరింత ఉపయోగకరంగా ఉందని, .బూత్ కమిటి కన్వీనర్ చాకివేల శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు ప్రియాంక అంజలి వనజ జానకి నాజియా మస్తాన్ విద్యార్థులు విద్యార్థినీలు తదితరులు పాల్గొన్నారు.

# వి క్యూబ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నోట్ బుక్స్ పంపిణీ




**గుడ్లవల్లేరు, (ఆకాంక్ష న్యూస్) :** గుడ్లవల్లేరు మండలం రెడ్డిపాలెం గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వి క్యూబ్ ఫౌండేషన్ అధినేత పామర్తి వీర రాఘవులు మరియు మోదుగుమూడి అంకాల రావు ఆధ్వర్యంలో పుస్తకాలను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు మరియు వి క్యూబ్ ఫౌండేషన్ మెంబర్స్ మరియు గ్రామ ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

# చదువుల తల్లికి చేయూత..యలమంచిలి



**కంకిపాడు, (ఆకాంక్ష న్యూస్) :** ప్రతిభ ఉన్నప్పటికి కుటుంబ ఆర్థిక స్థోమత సహకరించక పోవడం వల్ల చిన్నారులు విద్యకు దూరం కావడం అత్యంత బాధాకరమని, అటువంటి పరిస్థితి తలెత్తకూడదనే సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా తల్లికి వందనం పథకం నిధులను పాఠశాలల పునఃప్రారంభం రోజునే నారా చంద్రబాబునాయుడు విడుదల చేశారని కంకిపాడు మండల %ఱఖా% సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వ పాలన తొలి ఏడాది పూర్తయిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని, కంకిపాడు పట్టణానికి చెందిన తెలుగుదేశం పార్టీ ఆత్మీయ కుటుంబ సభ్యుడు పెసరమిల్లి చక్రవర్తి కుమార్తె, 9వ తరగతి చదువుతున్న పెసరమిల్లి సునందనకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి, పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలకు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సామాన్య ప్రజల అంచనాలకు మించి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, రాష్ట్రాన్ని శర వేఘంగా వృద్ధి పథంలో పరుగులు పెట్టిస్తూ కూటమి ప్రభుత్వ తొలి ఏడాది పాలన సూపర్ హిట్టయిందన్నారు. అలాగే స్థానిక శాసనసభ్యులు బోడె ప్రసాద్ మొక్కవోని కృషితో పెనమలూరు నియోజకవర్గం కూడా సర్వతోముఖాభివృద్ధి చెందుతోందని సంతోషం వెలిబుచ్చారు.

# ప్రైవేట్ స్కూల్స్ లో జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించండి

### మంత్రి కొల్లు రవీంద్రను కోరిన మచిలీపట్నం మీడియా మిత్రులు

### మీడియా మిత్రుల విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మంత్రి

### ఫీజు రాయితీకై కలెక్టర్ అండార్స్ చేసిన మంత్రి



**మచిలీపట్నం, (ఆకాంక్ష న్యూస్) :** జిల్లాలోని ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యనభ్యసిస్తున్న వర్కింగ్ జర్నలిస్ట్ పిల్లలకు 50% ఫీజు రాయితీ కల్పించాలని మచిలీపట్నం మీడియా మిత్రులు రాష్ట్ర గనులు, భూగర్భవనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను కోరారు. ఈ మేరకు శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో తక్షణమే ఫీజు రాయితీ ఉత్తర్వులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. అలాగే 6వ తరగతి పైబడిన జర్నలిస్టుల పిల్లలకు విద్యాశాఖ ద్వారా ఉచితంగా పాఠ్య పుస్తకాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.మచిలీపట్నం మీడియా మిత్రుల విజ్ఞప్తిపై మంత్రి కొల్లు రవీంద్ర సానుకూలంగా స్పందించారు. ఫీజు రాయితీ, పాఠ్య పుస్తకాల పంపిణీ చేసే కలెక్టర్ కు అండార్స్ చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఇందుకు మీడియా మిత్రులు మంత్రి రవీంద్రకు కృతజ్ఞతలు తెలిపారు.

# యోగాను ప్రతి ఒక్కరూ సాధన చేయాలి:శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్

### ఘంటసాలలోని బౌద్ధ స్తూపం వద్ద ఘనంగా యోగా కార్యక్రమం నిర్వహణ

### కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, అధికారులు, ప్రజలు..

### ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు నిర్వహించిన యోగా శిక్షకులు.






**ఘంటసాల, (ఆకాంక్ష న్యూస్) :** ప్రతి రోజు యోగా సాధన చేసి శారీరక, మానసిక ఆరోగ్యం పొందాలని అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వం జూన్ 21వ తేదీన 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవమును రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించాలనే లక్ష్యంతో మే 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర-2025 కార్యక్రమములు ఒక నెల పాటు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఘంటసాల మండలంలో ప్రముఖ బౌద్ధ క్షేత్రమైన ఘంటసాల గ్రామంలోని బౌద్ధ స్తూపం వద్ద యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి కే చంద్రశేఖరరావు ఇతర అధికారులు ఉత్సాహంగా పాల్గొని ప్రజలతోపాటు సామూహిక యోగాసనాలు నిర్వహించారు. ప్రత్యేక వేదిక నుండి యోగా శిక్షకులు రెబ్బా పోతన శాస్త్రి ఆసనాలు వేసే విధానాన్ని చూపుతూ ప్రభుత్వ ప్రోటోకాల్ ప్రకారం వారి చేత యోగాసనాలు వేయించి యోగ ప్రతిజ్ఞ చేయించారు.ప్రజలు ఆసనాలు వేసేందుకు వీలుగా బౌద్ధ స్తూపం వద్ద పచ్చని తివాచీలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేసి వారికి అల్పాహారం, తాగునీరు అందించారు.కార్యక్రమంలో అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర కలిగి పవిత్రమైన బౌద్ధారామంలో యోగా కార్యక్రమం నిర్వహించడం ఈ ప్రాంతానికి ఎంతో గర్వకారణం అన్నారు. అంత విశిష్టత కలిగిన యోగ గొప్పతనాన్ని దేశ ప్రధాని నరేంద్ర మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పే ప్రయత్నం చేస్తున్నారని, జూన్ 21వ తేదీన విశాఖపట్నంలో నిర్వహించే 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతుందన్నారు. దాదాపు 2 వేల సంవత్సరాల క్రితం బౌద్ధ ధర్మాన్ని ఇతర దేశాలకు వ్యాపింప చేయడంలో ఘంటసాల బౌద్ధ క్షేత్రమునకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. నాడు యోగాను అనుసరించడం వల్లే గౌతముడు బుద్ధుడు అయ్యాడని, ధ్యానముద్రలో ఉన్న గౌతముని ప్రతిమలే అందుకు నిదర్శనం అన్నారు. యోగాన్ని, ధ్యానాన్ని అనుసరించడం వల్లే గౌతమ బుద్ధుడు జ్ఞాని అయ్యాడని ఆయన పేర్కొన్నారు. యోగ ప్రాముఖ్యతను తెలియజేసేలా త్వరలో నియోజకవర్గంలో కృష్ణా నది పరివాహక ప్రాంతంలో జల యోగ కార్యక్రమం నిర్వహిస్తామని శాసనసభ్యులు తెలిపారు. డిఆర్ఓ కే చంద్రశేఖరరావు మాట్లాడుతూ జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా దినోత్సవం నాటికి రాష్ట్ర ప్రజలందరికీ యోగా ప్రాముఖ్యతను తెలియజెప్పి, యోగాను వారి జీవనశైలిలో భాగస్వామ్యం చేసే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. యోగాను ప్రతిరోజు సాధన చేయడం ద్వారా ఆరోగ్యంపై పెట్టే ఖర్చులు తగ్గించుకోవచ్చని, యోగ సాధనకు రూపాయి ఖర్చు కూడా అవసరం లేదని, చిన్నపాటి స్థలంలో సాధన చేస్తూ ప్రయోజనం పొందవచ్చన్నారు. ప్రజలందరూ యోగా ప్రాముఖ్యతను తెలుసుకొని, వారి జీవనశైలిలో భాగం చేసుకోవాలని కోరారు.అనంతరం వివిధ యోగ విన్యాసాలతో బాల బాలికలు చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా యోగశిక్షకులు, చిన్నారులను అతిథులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో బందరు ఆర్డిఓ కే స్వాతి, అవనిగడ్డ సబ్ డివిజన్ డిఎస్పీ టి విద్యశ్రీ, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, జిల్లా పర్యాటక శాఖ అధికారి జి రామలక్ష్మణరావు, మెప్మా పిడి సాయిబాబు, ఎంపీడీవో సుబ్బారావు, తహసిల్దార్లు విజయ ప్రసాద్, హరినాథ్, ఆయుష్ శాఖ అధికారి డాక్టర్ జావేద్ ఖాన్, యోగ గురువులు మద్దాల చింతయ్య, నాగరాజు, శేష ప్రసన్న, డ్వాక్రా మహిళలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# దివ్యజ్ఞాన సమాజం ద్వారా చైతన్య సదస్సులు:సీనియర్ ఆడిటర్ సి. శేషాచార్యులు.




**మచిలీపట్నం, (ఆకాంక్ష న్యూస్) :** నేటి సమాజంలో మానవ సంబంధాలు దిగజారి పోతున్నాయని సమాజంలో నైతిక విలువల పట్ల యువతరాన్ని అప్రమత్తం చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ సీనియర్ ఆడిటర్ సి. శేషాచార్యులు అన్నారు. శుక్రవారం మచిలీపట్నం ఈడేపల్లి లోని దివ్యజ్ఞాన సమాజ సమావేశ మందిరంలో జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. సమాజంలో మంచిని పెంపొందించడానికి దివ్యజ్ఞాన సమాజం భారతదేశవ్యాప్తంగా ముందుంటుందని తెలియజేశారు. నేటి యువతరానికి నైతిక విలువలు అందించకపోతే రాబోయే రోజుల్లో సమాజ పరిస్థితులు మరింత దిగజారుడికి తనానికి గురవుతుందని అన్నారు. కొడుకులు తండ్రిని చంపడం, భార్యా భర్తను చంపడం భర్త భార్యను చంపడం పిల్లలను చంపడం వంటి అనైతిక కార్యక్రమాలు రోజురోజుకీ పెరిగిపోతున్నాయని ఇది సమాజానికి మంచిది కాదని అన్నారు. సమావేశానికి అధ్యక్షత వహించిన దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజం ద్వారా రాబోయే విద్యా సంవత్సరంలో మచిలీపట్నంలోని ప్రతి పాఠశాల కాలేజీల్లో యువతకు విద్యార్థులకు నైతిక విలువ పట్ల సెమినార్లు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. అనుభవం కలిగిన సీనియర్ సొసైటీ వక్తలను ఈ కార్యక్రమంలో వినియోగిస్తామని తెలియజేశారు. గాడి తప్పుతున్న సమాజాన్ని సరిదిద్ద వలసిన బాధ్యత ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో పాటు స్వచ్ఛంద సంస్థలపై కూడా ఉందని బాలాజీ అన్నారు. విద్యార్థులను తరగతి గది నుండి నైతిక విలువలు నేర్పించి సమాజంలోకి తీసుకురావాలని అన్నారు. దివ్యజ్ఞాన సమాజం జాతీయ ఉపన్యాసకులు సవరం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ భారతదేశ దివ్యజ్ఞాన సమాజం అనేక కార్యక్రమాలు నిర్వహించి సమాజానికి మంచి చేస్తుందని తెలియజేశారు. రాబోయే రోజులలో మచిలీపట్నం దివ్యజ్ఞాన సమాజంలో మంచి లైబ్రరీని ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమాజం కార్యదర్శి కొత్త గుండురమేష్, కోశాధికారి ఎం. సత్యనారాయణ సీనియర్ సభ్యులు కారుమూరి రాజేంద్రప్రసాద్, డాక్టర్ ఉడత్తు శ్రీనివాసరావు, గుడిసేవ మురళీధర్, రామిశెట్టి దుర్గాప్రసాద్, పి.వి ఫణి కుమార్, ఎం ఎస్ వి ప్రసాద్, ఎం. నాగబసవయ్య, మాదిరెడ్డి బాబా, ఎం ఎన్ మల్లేశ్వరమ్మ, ఎన్. చలపతిరావు తదితరులు పాల్గొన్నారు. అహ్మదాబాద్ విమాన ప్రమాద మృతులకు దివ్య సమాజం ఘనంగా నివాళులర్పించింది.

# ప్రజలందరిపై ఆ భగవంతుడి ఆశీస్సులు వుండాలి:ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)



- చిట్టినగర్ లో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు హాజరు
- నగర అభివృద్ధిలో నగరాలు ఒక భాగం

**విజయవాడ, (ఆకాంక్ష న్యూస్) :** పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి తో పాటు రాష్ట్రాభివృద్ధి జరిగే విధంగా శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు ప్రజలందరిపై వుండాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ శాసనసభ్యుడు మరుపిళ్ల చిట్టి కాలం నుంచి నగరాలు అభివృద్ధిలో ఒక భాగం అయ్యారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. చిట్టి నగర్ లో జరుగుతున్న నగరాల శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం 14వ వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని ) ముఖ్యఅతిథి గా హాజరయ్యారు. వేదమంత్రాలు మంగళ వాయిద్యాలతో ఆలయ కమిటీ సభ్యులు పురోహితులు ఎంపీ కేశినేని శివనాథ్ కు స్వాగతం పలికారు. ఆలయంలో శ్రీ వెంకటేశ్వర స్వామిను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరాలు వారి సొంత నిధులతో గుడి, కళ్యాణ మండపం ఏర్పాటు చేసుకోవటం చాలా గొప్ప విషయమన్నారు. అలాగే వివిధ సహాయ కార్యక్రమాల ద్వారా పేద ప్రజలను ఆదుకునే విషయంలో నగరాలు ఎప్పుడు ముందంటారని కొనియాడారు. ఆలయ అభివృద్ధి, ఆలయ కమిటీకి అండగా వుంటామన్నారు.ఐదు రోజుల పాటు జరిగే శ్రీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రజలందరూ పాల్గొని ఆభగవంతుడి ఆశీస్సులు పొందాలని సూచించారు. రాష్ట్రాన్ని సుభిక్షంగా చూడాలని శ్రీ వేంకటేశ్వర స్వామిని ప్రార్థించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిల్లా శీను, నగరాల సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మరుపిళ్ల తిరుమల్లేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎమ్. ఎస్. బేగ్, ఎన్టీఆర్ జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు సోలంకి రాజు, రాష్ట్ర వాణిజ్య విభాగ ఆర్గనైజింగ్ సెక్రెటరీ దనేకుల సుబ్బారావు, పశ్చిమ నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షుడు ఆర్ మాధవ, పశ్చిమ నియోజకవర్గం తెలుగు మహిళా అధ్యక్షురాలు సుఖాసి సరిత, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, మైలవరపు కృష్ణ, ఆర్. శ్రీనివాసరావు (మాస్టారు ),టిడిపి సీనియర్ నాయకులు కోగంటి రామారావు, టిడిపి సీనియర్ మహిళా నాయకురాలు బంక నాగమణి, ఆలయ కమిటీ సభ్యులతో పాటు పాల్గొన్నారు.

# పెద్దపల్లి జిల్లా బీసీ డైరెక్టర్ గా కైలాసకోటి శ్రీనివాస్ నియామకం

గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : ఆమెన్ జస్టిస్ ఫర్ సిటిజెన్ హ్యూమన్ రైట్స్ అండ్ వరల్డ్ సోషల్ పీస్ కౌన్సిల్ పెద్దపల్లి జిల్లా డైరెక్టర్ గా కైలాసకోటి శ్రీనివాస్ ని జాతీయ ఛైర్మెన్ డా" ఉల్లెంగా నాగరాజు అధికారికంగా నియమించారు . ఈ సందర్భంగా డా " ఉల్లెంగా నాగరాజు మాట్లాడుతూ... ఈ మధ్య కాలంలో మానవ హక్కుల ఉల్లంఘనలు అడుగడుగునా జరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి ఉపయోగాలు తెలుసుకోవాలన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, రాజకీయ, లింగ వివక్ష లేకుండా భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 ప్రకారం అందరూ సమానులే అన్నారు. ఏ అధికారి కానీ, ప్రజా ప్రతినిధులు కానీ ప్రజల హక్కులకు భంగం కలిగించకుండా తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. వ్రాత పూర్వకంగా తమకు ఎవరైనా పిర్యాదులు ఇస్తే వాటిని జాతీయ మానవ హక్కుల కమీషన్, ఢిల్లీలో కేసు ఫైల్ చేయడం జరుగుతుందన్నారు. భాధితులకు త్వరతగతిన న్యాయం జరిగేందుకు మానవ హక్కుల కమీషన్ దోహద పడుతుందని నాగరాజు తెలిపారు. కైలాసకోటి శ్రీనివాస్ మాట్లాడుతూ... తన మీద నమ్మకం ఉంచి ఇంతటి గొప్ప బాధ్యతలు అప్పగించిన జాతీయ ఛైర్మెన్ డా. ఉల్లెంగా నాగరాజు, తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆకుల స్వామి పెద్దపల్లి జిల్లా చైర్మన్ పుల్లూరి నర్సింగ రావు కి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. భారత రాజ్యాంగానికి, సంస్థ నియమ, నిభందనలకు కట్టుబటి ప్రజలకు, భాధితులకు అండగా ఉండి, సమ సమాజ స్థాపనకు కృషి చేస్తానని హామీ ఇచ్చి ప్రమాణం చేశారు. పుల్లూరి నర్సింగ్ రావు మాట్లాడుతూ... మానవుల ప్రాథమిక హక్కులకు ఉల్లంఘన జరిగితే చట్టబద్ధమైన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు మనిషికి గుండెకాయ లాంటివన్నారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



# రామగుండం రాజకీయాల్లో విడదీయరాని స్నేహ బంధం

- లక్ష్మీ-లక్ష్మణుల మైత్రి రాజకీయాలకు దిశానిర్దేశం....
- పార్టీలు వేరైనా... బంధం ఒకటే...!
- రాజకీయాల్లో స్నేహానికి ప్రతీకగా కొంకటి - అడ్లూరి
- విడదీయరాని బంధం... రామగుండం రాజకీయ నేతల మానవ విలువలకు అద్దం....

గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) : రాజకీయాలు మారవచ్చు, పార్టీలు మారవచ్చు, పదవులు మారవచ్చు... కానీ కొన్ని బంధాలు మాత్రం కాలక్రమానికీ మచ్చలేకుండా నిలిచిపోతాయి. రామగుండం నియోజకవర్గానికి చెందిన రాజకీయ నాయకులు కొంకటి లక్ష్మీనారాయణ,అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల స్నేహ బంధం అలాంటిదే. పార్టీల తేడా లేకుండా, పదవుల భేదం లేకుండా ఇద్దరూ ఒకరినొకరు అన్నదమ్ముల్లా చూసుకుంటూ ఆత్మీయంగా ముందుకు సాగుతున్న ఈ ప్రయాణం నిజంగా ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తోంది. తెలుగుదేశం పార్టీలో కీలకంగా వ్యవహరించిన కొంకటి లక్ష్మీనారాయణ ప్రస్తుతం ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యునిగా పనిచేస్తున్నారు. కాంగ్రెస్ విద్యార్థి సంఘం నుంచి రాజకీయ రంగ ప్రవేశం చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రస్తుతం నాలుగు కీలక శాఖలైన ఎస్సీ ఎస్టీ సంక్షేమ శాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ, వికలాంగుల శాఖకు మంత్రిగా కొనసాగుతున్నారు. ఈ ఇద్దరి పరిచయం పదవుల వల్ల కాదు... పాత కాలం నుంచి వచ్చిన విశ్వాసం వల్ల. ఒకరిద్దరి మధ్య పరస్పర గౌరవం, ఆత్మీయత వల్ల ఏర్పడిన ఈ బంధం రాజకీయాల్లో స్నేహానికి నిలువెత్తు నిదర్శనం అని చెప్పవచ్చు. ఒకరికి మేయర్ పదవి వచ్చినప్పుడు మరొకరు జడ్పీ చైర్మన్‌గా పనిచేయడం, పార్టీలు వేరు అయినా కలిసి అభివృద్ధి కోసం పనిచేయడం వీరి మైత్రీకు అద్దంపడుతుంది. కాంగ్రెస్ సీనియర్ నేత వెంకటస్వామి సన్నిహితుడిగా పని చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తండ్రి నాగయ్య ఐఎన్టీయూసీలో కీలకంగా వ్యవహరించారు. ఆ ధార్మిక విలువలే లక్ష్మణ్ కుమార్‌లో ప్రతిబింబించాయి. 1984లో విద్యార్థి నాయకుడిగా ప్రారంభించిన ఆయన ప్రయాణం ఎమ్మెల్యే పదవికి, అనంతరం మంత్రివర్యులుగా ఎదగడంలో కొంకటి లక్ష్మీనారాయణ మద్దతు ఉన్నదనేది తథ్యమే. రాజకీయాల్లో వ్యక్తిగత గొడవలు, విభేదాలు సాధారణమే. కానీ వీరిద్దరి బంధం మాత్రం లి"రాజకీయానికి మించి స్నేహానికి ప్రతీక"లిగా నిలిచింది. ఇదే నిజమైన నాయకత్వం, ఇదే నిజమైన మానవత్వం. ఈ రోజు ఒకరు ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడిగా, మరొకరు మంత్రిగా కొనసాగుతుండగా... అందరికీ ఒక స్పష్టమైన సందేశం ఇస్తున్నారు. పదవులు తాత్కాలికం... కానీ బంధం శాశ్వతం" అని ఏది ఏమైనా వీరి రాజకీయ స్నేహబంధం రాజకీయాల్లో మంచి గుర్తింపునిస్తుంది.






# రైతు భరోసా నిధులపై కీలక అప్‌డేట్.. రెండు రోజుల్లో అకౌంట్లోకి డబ్బులు జమ.. !

(ఆకాంక్ష న్యూస్) : తెలంగాణ రాష్ట్రంలోని రైతన్నలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది. రైతు భరోసా పథకం కింద ఆర్థిక సహాయం రెండు, మూడు రోజుల్లో నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కానుంది. ఈ విషయాన్ని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క మహబూబాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా స్పష్టం చేశారు. వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో రైతన్నలకు ఈ ఆర్థిక తోడ్పాటు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, ఇది ప్రభుత్వ రైతు సంక్షేమ నిబద్ధతను చాటుతుందని ఆమె పేర్కొన్నారు. ఈ నిధుల విడుదల వ్యవసాయ పనులకు ఊతమిస్తుంది. తెలంగాణ రైతన్నలకు కాంగ్రెస్ ప్రభుత్వం కీలక శుభవార్తను అందించింది. అత్యంత ప్రతిష్టాత్మకమైన రైతు భరోసా పథకం కింద ఆర్థిక సహాయం రెండు, మూడు రోజుల్లో రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయని మంత్రి సీతక్క తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది రైతులకు, ముఖ్యంగా వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న తరుణంలో, ఎంతో ఆర్థిక తోడ్పాటును అందిస్తుంది. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం చూపుతున్న చొరవకు ఇది నిదర్శనం. వారంలోగా రైతుభరోసా నిధుల పెండింగ్ డబ్బులను క్లియర్ చేయనున్నట్లు తెలుస్తోంది. రైతులకు ఆర్థిక సహాయం అందిస్తూనే.. తెలంగాణ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు కూడా పూర్తి స్థాయిలో సన్నద్ధమవుతోంది. ఈ క్రమంలోనే, రాష్ట్ర మంత్రి సీతక్క కీలక ప్రకటన చేశారు. మహబూబాబాద్ జిల్లా పర్యటనలో ఉన్న ఆమె మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికలను జూలై నెలలో నిర్వహించబోతున్నామని.. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ త్వరలోనే విడుదల కానుందని స్పష్టం చేశారు. ముందుగా సర్పంచ్ ఎన్నికలు తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగానే.. రైతుభరోసా నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



## రైతు భరోసా: సమగ్ర పంట పెట్టుబడి సహాయం

రైతు భరోసా పథకం అనేది తెలంగాణలో పంట పెట్టుబడి సాయంగా రైతులను ఆదుకునే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఒక ముఖ్యమైన కార్యక్రమం. గతంలో ఉన్న 'రైతు బంధు' పథకం స్థానంలో దీనిని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద అర్హులైన రైతులకు ఏడాదికి ఎకరానికి రూ.12,000 ఆర్థిక సహాయం అందించబడుతుంది. ఈ మొత్తం ఖరీఫ్ , రబీ సీజన్లకు గాను ఒక్కో విడతలో రూ.6,000 చొప్పున పంపిణీ చేయబడుతుంది. ఈ నిధులు విత్తనాలు, ఎరువులు, కూలీ ఖర్చులు వంటి పంట పెట్టుబడి అవసరాలను తీర్చడానికి ఉపయోగపడతాయి. రైతుల బ్యాంక్ ఖాతాల్లో నేరుగా డబ్బు జమ చేయడం ద్వారా పారదర్శకతను పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత కొన్ని నెలలుగా.. ఈ నిధుల విడుదల ఆలస్యం కావడంపై రైతన్నల్లో కొంత అసంతృప్తి నెలకొంది. అయితే, నూతన ప్రభుత్వం గత ప్రభుత్వ ఆర్థిక పరిస్థితులను సమీక్షించి, రుణ భారం నుంచి బయటపడిన తర్వాత ఈ నిధుల విడుదలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు నిధుల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేశారు.. తద్వారా సాగు ప్రారంభానికి ముందే రైతన్నలకు పెట్టుబడి అందుబాటులోకి వస్తుంది. గత సీజన్ కు సంబంధించి 21 వేల కోట్లు రైతు బంధు(రైతు భరోసా) కింద ఇచ్చినట్లు ఇటీవల మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు.

# బిగ్ షాక్.. హైదరాబాద్ మెట్రో సెకండ్ ఫేజ్‌కు బ్రేక్..హైకోర్టు కీలక ఆదేశాలు..

హైదరాబాద్ : హైదరాబాద్ మహానగరంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన మెట్రో రైలు రెండవ దశ పనులకు హైకోర్టు తాత్కాలికంగా బ్రేక్ వేసింది. పాతబస్తీలోని కీలక వారసత్వ కట్టడాల పరిరక్షణ చర్యలపై సమగ్ర అధ్యయనం చేయకుండానే మెట్రో పనులు ప్రారంభించడాన్ని సవాలు చేస్తూ, యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం పై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇది నగర అభివృద్ధి ప్రణాళికలో వారసత్వ సంపద పరిరక్షణ ప్రాముఖ్యతను మరోసారి నొక్కి చెప్పింది. మెట్రో రెండవ దశ పనులు పాతబస్తీ గుండా సాగుతుండటంతో.. అక్కడ ఉన్న అనేక వారసత్వ కట్టడాలైన చార్మినార్, ఫలక్‌నుమా ప్యాలెస్, పురాణి హవేలి, మొగల్‌పురా టూంబ్ వంటి వాటికి ప్రమాదం పొంచి ఉందని యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ హైకోర్టుకు విన్నవించింది. ఈ ప్రాజెక్టుల వల్ల చారిత్రక కట్టడాల పునాదులు దెబ్బతినే అవకాశం ఉందని, వాటి నిర్మాణాత్మక స్థిరత్వంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పిల్‌లో పేర్కొన్నారు. ఈ కట్టడాలు తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతీకలు, వాటి పరిరక్షణ భవిష్యత్ తరాలకు అత్యంత ఆవశ్యకం. వ్యాజ్యంలో భాగంగా.. హెరిటేజ్ రక్షణ, పర్యావరణ, పురావస్తు తదితర విభాగాల నిపుణులతో కూడిన ఒక స్వతంత్ర కమిటీతో సమగ్ర అధ్యయనం చేయించాలని కోరారు. అంతేకాకుండా.. తెలంగాణ, కేంద్ర పురావస్తు శాఖల నుంచి అవసరమైన అనుమతులు తీసుకున్నాకే పనులు కొనసాగించేలా.. అప్పటివరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఆదేశాలు జారీ చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అభివృద్ధి ప్రాజెక్టుల రూపకల్పనలో సాంస్కృతిక వారసత్వం, పర్యావరణ ప్రభావ అంచనాలను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని ఈ వ్యాజ్యం పరోక్షంగా సూచిస్తోంది. యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ తరఫున వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అప్పటివరకు హైదరాబాద్ మెట్రో రెండవ దశ పనులను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఇది ప్రభుత్వానికి.. మెట్రో అధికారులకు ఒక హెచ్చరికగా భావించాలి. ఈ హైకోర్టు తీర్పు హైదరాబాద్ మెట్రో రెండవ దశ ప్రాజెక్టు సమయపాలనపై ప్రభావం చూపనుంది. అయితే.. చరిత్ర, వారసత్వ సంపద పరిరక్షణ విషయంలో న్యాయస్థానం జోక్యం చేసుకోవడం పర్యావరణవేత్తలు, చరిత్రకారులు, పౌర సంఘాల నుంచి ప్రశంసలు అందుకుంటోంది. భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను చేపట్టేటప్పుడు చారిత్రక ప్రాధాన్యత కలిగిన ప్రాంతాలపై వాటి ప్రభావం, వాటి పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై తగినంత శ్రద్ధ వహించడం ప్రభుత్వాలకు, అభివృద్ధి సంస్థలకు అత్యంత కీలకం. ఈ వివాదం అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ మధ్య సమతుల్యతను ఎలా సాధించాలనే దానిపై విస్తృత చర్చకు దారితీస్తుంది.

# అమెరికాలో తప్పిన ఘోర విమాన ప్రమాదం

## ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై ఒక్కసారిగా అదుపు తప్పిన విమానం




న్యూఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) : అమెరికాలో ఘోర విమాన ప్రమాదం తప్పింది. బోస్టన్ లోని లోగాన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రన్‌వేపై ఓ విమానం అదుపుతప్పింది. రన్‌వే నుంచి జారి పక్కకు దూసుకెళ్లింది. అయితే, పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. జెట్‌బ్లూ సంస్థకు చెందిన 312 విమానం షికాగో నుంచి బోస్టన్‌లోని లోగాన్ ఎయిర్‌పోర్ట్‌కు వచ్చింది. ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై ఒక్కసారిగా అదుపుతప్పింది. రన్‌వే నుంచి జారి పక్కకు దూసుకెళ్లింది. పైలట్ చాకచక్యంగా వ్యవహరించి అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. దీనిపై జెట్‌బ్లూ సంస్థ స్పందించింది. విమానం ల్యాండింగ్ తర్వాత రన్‌వే నుంచి పక్కకు దూసుకెళ్లినట్లు పేర్కొంది. ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టినట్లు వెల్లడించింది. కాగా, గురువారం మధ్యాహ్నం గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో 265 మంది ప్రాణాలు కోల్పోయారు.

# టాస్కాకు జైకొట్టిన చౌల్లేరు వయోజనులు

- ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్న అధ్యక్షుడు జయమోహనా చార్య...
- రక్షణకు తగు చట్టాలు ఉన్నాయన్న ప్రధాన కార్యదర్శి పులుగం చక్రపాణి...
- చౌల్లేరు టాస్కా పోస్టర్ల ఆవిష్కరణలో దాదాపు 50 మంది వయోజనులు



యాదగిరిగుట్ట(ఆకాంక్ష న్యూస్) : వయోజనుల సం రక్షణకు ప్రభుత్వం ఎన్నో పథకాలు రూపొందించినప్పటికీ తగు ప్రచారం లేకపోవడంతో వాటి ప్రయోజనాలను వయోజనులు సంపూర్ణంగా పొందలేకపోతున్నారని , అందుకే టాస్కా విశేష ప్రచారానికి పూనుకుందని యాదగిరిగుట్ట మండల టాస్కా ( తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ) అధ్యక్షుడు ముడుంబై జయమోహనా చార్య అన్నారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ( పురుషులు, స్త్రీలు ) దరఖాస్తు చేసుకుని ప్రభుత్వం అందించే సీనియర్ సిటిజన్స్ కార్డులను పొందాలని ఆయన సూచించారు. కుటుంబ సభ్యుల తోపాటు ప్రభుత్వ పథకాలు తోడైతే వృద్ధులకు ముసలితనం భారంగా మారబోదని , అన్ని విధాలుగా వయోజనులను ఆదుకోవాలని అధ్యక్షుడు ముడుంబై జయమోహనా చార్యతో సహా ప్రధాన కార్యదర్శి పులుగం చక్రపాణి పభుత్వానికి ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని చౌల్లేరు గ్రామంలో డాక్టర్ రాగి సహదేవ్, నూకల సుధాకర్ రెడ్డి, గుంటి యాదగిరి, గుండ్లపల్లి మల్లేశం గౌడ్ , గౌడ యాదగిరిలతో కూడిన టాస్కా బృందం చట్టం పై వృద్ధుల్లో అవగాహన కల్పించారు. ఆర్టీసీ బస్సుల్లో, రైళ్లలో వృద్ధులకు చార్జీలో రాయితీ ఇవ్వాలని, ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందించాలని, యాదగిరిగుట్ట లో 150 పడకల ఉచిత వృద్ధాశ్రమం నిర్మించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. చౌల్లేరు గ్రామ అవగాహన కార్యక్రమంలో భువనగిరి నర్సయ్య, వడ్లకొండ పెంటయ్య, బోడ ప్రకాశ్ , రవ్వ రాములు, గంప రమేష్, చిల్ల రాములు, థామస్, తోటకూరి ఐలయ్య, వద్దిగల్ల బిక్షపతి, కొక్కలకొండ ఐలయ్య, వదిగల్ల దేవదాసు, బోదాసు పెంటయ్య , గడ్డమీది మల్లమ్మ, కొక్కలకొండ యాదమ్మ, భువనగిరి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. త్వరలో గ్రామ టాస్కా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని గ్రామ వయోజనులు నిర్ణయించుకున్నారు.

# కేసీఆర్ తెలంగాణ జాతి పిత కాదు




హైదరాబాద్(ఆకాంక్ష న్యూస్) : బీఆర్ఎస్ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు , ఆయన కుమారుడు కేటీఆర్ పై కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ గజ్జల కాంతం కామెంట్స్ చేశారు. శుక్రవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ తెలంగాణ జాతి పిత కాదని, కేసీఆర్‌ని విచారణకు ఎందుకు పిలవకూడదని ప్రశ్నించారు. నీతి మంతులు అయితే విచారణ ఎదుర్కోవాలన్నారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరో సారి పిచ్చిపిచ్చిగా మాట్లాడితే ఆయన ఇల్లు ముట్టడిస్తామని గజ్జల కాంతం అన్నారు.

## అవినీతి జరిగిందని తెలిసే విచారణకు..ఆదేశం

రాష్ట్ర ముఖ్యంత్రిగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన రోజే కాళేశ్వరంపై విచారణ చేయిస్తామని మాట ఇచ్చారని, పీసీసీ చీఫ్‌గా ఉన్నపుడే రేవంత్ రెడ్డి కాళేశ్వర ప్రాజెక్టులో జరిగిన అవినీతిని బయట పెట్టారని అన్నారు. బీఆర్ఎస్ అవినీతి భరింలేకనే రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. అధికారులు, చీఫ్ ఇంజనీర్లను విచారణ చేసిన తర్వాతే అవినీతి జరిగిందని కమిటీ నిర్ధారించి కేసీఆర్‌ను విచారణకు పిలిచిందన్నారు.

## టెలికం శాఖ మొబైల్ ప్లాన్ల మార్పు ప్రక్రియను మరింత సరళతరం....




**న్యూ ఢిల్లీ(ఆకాంక్ష న్యూస్) :** దేశంలో మొబైల్ వినియోగదారులకు  గుడ్ న్యూస్ వచ్చేసింది. టెలికం శాఖ మొబైల్ ప్లాన్ల మార్పు ప్రక్రియను మరింత సరళతరం చేయాలని నిర్ణయించింది. జూన్ 10, 2025 నుంచి అమల్లోకి వచ్చిన ఈ మార్పులతో వినియోగదారులు తమ అవసరాలకు అనుగుణంగా టెలికాం ప్లాన్లను ఈజీగా మార్చుకోవచ్చు. ఈ మార్పు ప్రకారం మీరు ఒకసారి ప్రీపెయిడ్ నుంచి పోస్ట్‌పెయిడ్ లేదంటే పోస్ట్‌పెయిడ్ టూ ప్రీపెయిడ్‌కు మారిన తర్వాత, తదుపరి మార్పు కోసం కేవలం 30 రోజుల వేచి ఉంటే సరిపోతుంది.

### ఓటిపి ఆధారిత మార్పు.....

ఇది వరకు ఈ వ్యవధి 90 రోజులుగా ఉండేది. అంటే 30 రోజుల తర్వాత మీకు ఆ ప్లాన్ నచ్చకుంటే మళ్లీ మారిపోవచ్చు. ప్రస్తుతం, మీరు %ూ% ద్వారా మీ ప్లాన్ మార్చుకునే ఛాన్సుంది. ఈ ప్రక్రియలో మీ ఆధార్ లేదా డిజిలాకర్ ద్వారా మీ వివరాలు ధృవీకరించబడతాయి. ఫిజికల్ %ఞజ% కూడా అవసరం లేదు. మీరు 30 రోజుల కూలింగ్ ఆఫ్ సమయంలో ఉంటే, ఫిజికల్ %ఞజ% ప్రక్రియ ద్వారా ప్లాన్ మార్చుకోవచ్చు. ఈ ప్రక్రియలో మీ వివరాలు ఆథొరైజ్డ్ పాయింట్ ఆఫ్ సేల్ వద్ద ధృవీకరించబడతాయి.

## నేత్రదానంపై అపోహలు వీడండి..!



**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** నేత్రదానంపై అపోహలు వీడి, ప్రతి ఒక్కరూ మరణానంతరం నేత్రదానం చేయడానికి ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి కే.ఎస్.వాసు, ఫౌండేషన్ సలహాదారులు దేవి లక్ష్మీ నర్సయ్య, లూర్ధు రెడ్డి పిలుపునిచ్చారు. గోదావరిఖని గాంధీ నగర్ కు చెందిన ఊట్ల విష్ణు వర్ధన్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేసి ఇద్దరికీ చూపును ప్రసాదించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం నేత్రదాత సంస్మరణ సభను, సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రచార కార్యదర్శి వాసు, పట్టణ కార్యదర్శి బోళ్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా రెండు నిమిషాలు మౌనం పాటించి మృతునికి నివాళులర్పించారు.  సందర్భంగా వారు మాట్లాడుతూ... నేత్రదానంపై అవగాహన కల్పించారు. కుటుంబ పెద్ద మరణించిన విషాదంలో కూడా నేత్రదానం చేసి అందరికి స్ఫూర్తిగా నిలిచారన్నారు. అనంతరం మృతుని భార్య విజయ, కూతురు రవళి, కుమారుడు సాయి మణిదీపక్ లకు సదాశయ ఫౌండేషన్ అభినందన పత్రాన్ని అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మృతుని బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

## ‘అమ్మ మాట - అంగన్వాడి బాట’ కార్యక్రమం...



**గోదావరిఖని (ఆకాంక్ష న్యూస్) :** అంగన్వాడి కేంద్రాల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యను ప్రోత్సహించేందుకు చేపట్టిన ‘అమ్మ మాట - అంగన్వాడి బాట’ కార్యక్రమం సందర్భంగా అడ్డగుంటపల్లి, సాధన నగర్ మరియు మారుతీనగర్ ప్రాంతాల్లో విస్తృతంగా గృహసందర్శనలు నిర్వహించారు.%×జణూ% సూపర్‌వైజర్ జమున మేడం ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో, 3 నుండి 6 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను అంగన్వాడి కేంద్రాలకు చేర్పించాలన్న లక్ష్యంతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ క్రమంలో పిల్లల సంఖ్యపై సర్వే కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్లు కె. రజిత (సాధన నగర్, ఎస్. స్వరూప అడ్డగుంటపల్లి జి. శారద మారుతీనగర్ కళ్యాణ్ నగర్  తదితర సిబ్బంది పాల్గొన్నారు. చిన్నారులు, వారి తల్లులు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం.అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల చైతన్యం, విద్యా పురోగతికి పునాదులు వేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించామని నిర్వాహకులు తెలిపారు.

## ఉద్యమకారుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి




**ఓదెల, పెద్దపల్లి జిల్లా (ఆకాంక్ష న్యూస్) :** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం గల్లీ నుండి ఢిల్లీ దాకా కొట్లాడిన తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుండేటి ఐలయ్య యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా  మాట్లాడుతూ ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలాన్ని ఇస్తామని చెప్పింది కనుక రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి  ఉద్యమకారుల గురించి ఆలోచించి ఉద్యమకారుల అందరికీ న్యాయం చేయాలని కోరారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జూన్ 2వ తారీఖున రాష్ట్రం రావడానికి గల కారణమైన ఉద్యమకారులకు మరియు ఉద్యమ సమయంలో అండగా నిలబడ్డ జర్నలిస్టులకు ఘనంగా సన్మానించాలని కోరారు. జిల్లాలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమకారుల చరిత్ర పుస్తకాలలో లిఖించబోతున్నామని ఉద్యమకారుల చరిత్రను భవిష్యత్ తరాలకు అందించాలని ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.ఉద్యమకారులందరూ ఈ కార్యక్రమానికి సహకరించి, మద్దతు ఇవ్వాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, జిల్లా మంత్రి శ్రీధర్ బాబు,మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్,ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్, ల మీద తమకు పూర్తి విశ్వాసం ఉందని ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం తమకు న్యాయం చేస్తుందని  నమ్మకం మీద ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు మరియు కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నిద్రిస్తున్న 90 ఏళ్ల వృద్ధురాలిపై..
# 25 ఏళ్ల యువకుడు.. ఘోరంగా లైంగిక దాడి



**(ఆకాంక్ష న్యూస్) :** రంగారెడ్డి జిల్లా యాచారంలో 90 ఏళ్ల వృద్ధురాలిపై లైంగిక దాడి జరిగింది. ఒంటరిగా నిద్రిస్తున్న ఆమెపై పాతికేళ్ల యువకుడు దాడి చేసి అత్యాచారం చేశాడు. ఉదయం పనిమనిషి ఆమెను రక్తంతో చూసి పోలీసులకు తెలిపింది. గంజాయి బ్యాచ్ పనే కావచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. దాడికి మరో ఇద్దరు సహకరించినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తెలిసింది. ఈ ఘటన ఒంటరి వృద్ధుల భద్రత, మాదక ద్రవ్యాల నియంత్రణపై ఆందోళనలు పెంచింది. పోలీసులు సమగ్ర దర్యాప్తు చేపట్టారు. నిద్రిస్తున్న వృద్ధురాలిపై యువకుడి దారుణం. రంగారెడ్డి జిల్లాలోని యాచారం పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటుచేసుకున్న ఒక దారుణ ఘటన స్థానిక ప్రజలను దిగ్భ్రాంతికి గురిచేసింది. 90 సంవత్సరాల వృద్ధురాలిపై ఒక యువకుడు అమానుషంగా లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన భద్రతా లోపాలను, ప్రాంతంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల ప్రభావంపై తీవ్ర ఆందోళనలను రేకెత్తించింది. పోలీసులు, స్థానికులు వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈ దారుణానికి పాల్పడిన వ్యక్తికి మరో ఇద్దరు బయట ఉండి సహాయం అందించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత.. ఆ వృద్ధురాలు తన నివాసంలో నిద్రిస్తున్నారు. అర్ధరాత్రి సమయంలో తలుపు తట్టిన శబ్దం విని, ఆమె తలుపు తెరవగానే.. సుమారు పాతికేళ్ల వయసున్న ఒక యువకుడు క్రూరంగా లోపలికి చొరబడ్డాడు. వయసు భారంతో సత్తువ కోల్పోయిన ఆమె.. ప్రతిఘటించడానికి ప్రయత్నించినప్పటికీ, తన గొంతునుంచి పెద్దగా కేక వేయలేకపోయారు. ఆ దుర్మార్గుడు ఆమెపై దాడి చేసి, లైంగిక అఘాయిత్యానికి ఒడిగట్టిన అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. తెల్లవారుజామున నిత్యం పనికి వచ్చే పనిమనిషి ఇంట్లోకి ప్రవేశించగానే, రక్తపు మరకలతో, స్పృహ లేకుండా పడి ఉన్న ఆ వృద్ధురాలిని చూసి ఆశ్చర్యపోయింది. వెంటనే ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించడంతో స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ దారుణాన్ని చూసి గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలకు, ఆవేదనకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వేగంగా సంఘటనా స్థలానికి వచ్చి, వృద్ధురాలిని అత్యవసర చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఒక కుమారుడు విదేశాల్లో, మరొకరు నగరంలో నివసిస్తుండగా, ఆమె చాలాకాలంగా గ్రామంలో ఒంటరిగా జీవిస్తున్నారు. వారి కుటుంబ సభ్యులు, బంధువులు ఈ సంఘటనతో తీవ్ర శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రాథమిక విచారణలో.. ఈ దారుణంలో ప్రధాన నిందితుడికి మరో ఇద్దరు వ్యక్తులు బయట ఉండి సహకరించినట్లు తేలింది. యాచారం పరిసర ప్రాంతాల్లో మాదకద్రవ్యాల వినియోగం పెరుగుతోందని, ముఖ్యంగా గంజాయి వినియోగించే సమూహాల ఆగడాలు ఎక్కువయ్యాయని స్థానికులు తీవ్రంగా ఆరోపిస్తున్నారు. ఈ దాడి వెనుక గంజాయి మత్తులో ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉండొచ్చని వారు బలంగా అనుమానిస్తున్నారు. ఏసీపీ రాజు మాట్లాడుతూ.. కేసు దర్యాప్తు పురోగతిలో ఉందని, నిందితులను గుర్తించి త్వరలోనే అరెస్ట్ చేస్తామని తెలిపారు. సమగ్ర దర్యాప్తు పూర్తయిన తర్వాతే పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటన గ్రామీణ ప్రాంతాల్లో ఒంటరిగా నివసించే వృద్ధుల భద్రతకు సంబంధించిన తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. పోలీసులు గ్రామీణ ప్రాంతాల్లో నిఘాను పటిష్టం చేయాలని, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని సమూలంగా అరికట్టడానికి మరింత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. వృద్ధులకు రక్షణ కల్పించేందుకు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని, వారి భద్రతపై అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేయాలని పౌర సమాజ కార్యకర్తలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ అమానుష చర్య సమాజంలో మానవత్వం లోపిస్తున్న తీరును, అటువంటి దుశ్చర్యలను అరికట్టడానికి సామూహిక బాధ్యత ఆవశ్యకతను నొక్కి చెబుతుంది.

# హైదరాబాద్ మెట్రో రెండో దశ
# పనుల నిలిపివేతపై ఎండీ ఎన్వీఎస్ రెడ్డి క్లారిటీ



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ మెట్రో పనులపై హైకోర్టు స్టే ఆదేశాలు అవాస్తవమని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. పాతబస్తీలోని వారసత్వ నిర్మాణాలను కూల్చివేయడం జరగదని హైకోర్టుకు ఇచ్చిన కౌంటర్‌లో హామీనిచ్చారు. చార్మినార్, ఫలక్‌నుమా వంటి నిర్మాణాలు మెట్రో మార్గానికి దూరంగా ఉన్నాయి. పిటిషనర్ అదనపు అఫిడవిట్‌కు ప్రతిస్పందనగా సమయం కోరారు. ప్రభావిత ప్రైవేట్ భవనాల కూల్చివేత పరిహారం చెల్లించాకే జరుగుతుంది. 311 ఆస్తులు స్వాధీనం చేసుకుని.. రూ.283 కోట్లు పంపిణీ చేశారు.

### మెట్రో పనులు ఆగలేదని క్లారిటీ ఇచ్చిన ఎండీ..

హైదరాబాద్‌లోని పాతనగరంలో మెట్రో రైల్ ప్రాజెక్టు విస్తరణ పనులపై హైకోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందంటూ కొన్ని వార్తా పత్రికలు, న్యూస్ ఛానెళ్లలో వచ్చిన వార్తలు అవాస్తవమని, తప్పుదారి పట్టించేవిగా ఉన్నాయని హెచ్ఏఎంఎల్ (హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో లిమిటెడ్) ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు. మెట్రో పనులపై హైకోర్టు ఎటువంటి స్టే ఆర్డర్ ఇవ్వలేదని ఆయన నిస్సందేహంగా తెలిపారు. ఇది పాతబస్తీ మెట్రో పనుల పురోగతిపై ఉన్న అనుమానాలకు తెరదించి.. ప్రజలకు, నిర్మాణ సంస్థలకు ఒక స్పష్టతను ఇచ్చింది.

### హైకోర్టుకు సమర్పించిన కౌంటర్..

యాక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్  దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం కు ప్రతిస్పందనగా హెచ్ఏఎంఎల్ గతంలోనే హైకోర్టుకు ఒక కౌంటర్ దాఖలు చేసింది. ఆ కౌంటర్‌లో.. ఓల్డ్ సిటీలో ఉన్న ఏ వారసత్వ నిర్మాణాన్ని కూల్చివేయడం జరగదని హెచ్ఏఎంఎల్ స్పష్టంగా విన్నవించిందని ఎండీ శ్రీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడించారు. చార్మినార్, ఫలక్‌నుమా వంటి చారిత్రాత్మక నిర్మాణాలు మెట్రో రైల్ అలైన్‌మెంట్ (మార్గం)కి దూరంగా ఉన్నాయని అఫిడవిట్‌లో పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. హెచ్ఏఎంఎల్ తరఫున అదనపు అడ్వకేట్ జనరల్ ఇమ్రాన్ ఖాన్ న్యాయస్థానానికి హామీ ఇస్తూ, ఎటువంటి పురాతన కట్టడాలను, ప్రాంగణాలను తాకడం లేదా కూల్చివేయడం జరిగే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ హామీలు పాతబస్తీ చారిత్రక ప్రాధాన్యతను గౌరవిస్తూనే, అభివృద్ధి పనులను కొనసాగించాలనే ప్రభుత్వ నిబద్ధతను చాటుతున్నాయి.

### అదనపు అఫిడవిట్ల దాఖలు..

హైకోర్టు ఆదేశాలను కొందరు వక్రీకరిస్తూ తప్పుడు సమాచారం అందిస్తున్నారని ఎండీ శ్రీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. పిటిషనర్, హెచ్ఏఎంఎల్ అదనపు అఫిడవిట్లు, కౌంటర్ అఫిడవిట్లను దాఖలు చేశాయని తెలిపారు. కొన్ని రోజుల క్రితం పిటిషనర్ దాఖలు చేసిన తాజా అదనపు అఫిడవిట్లకు, అదనపు అడ్వకేట్ జనరల్ హెచ్ఏఎంఎల్ తరఫున తన ప్రతిస్పందనను దాఖలు చేయడానికి కొంత సమయం కోరారు. హైకోర్టు సమగ్రమైన కౌంటర్ దాఖలు చేయడానికి మూడు వారాల సమయం ఇచ్చిందని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. మధ్యంతర ఉపశమనం ఏదైనా ఇదివరకు ఇచ్చి ఉంటే, తదుపరి విచారణ తేదీ వరకు అది అమలులో ఉంటుందని మాత్రమే హైకోర్టు తన ఉత్తర్వులలో పేర్కొందని ఆయన స్పష్టం చేశారు. ఇది పనుల నిలిపివేతకు సంబంధించిన సాధారణ స్టే ఆర్డర్ కాదని ఆయన పరోక్షంగా తెలియజేశారు.

### పాతనగరంలో కూల్చివేతలు, ప్రజల సహకారం

ప్రభావిత ఆస్తుల యజమానులకు ఇచ్చే కన్సెంట్ అవార్డుల ఆధారంగా సముచితమైన పరిహారం చెల్లించిన తర్వాతే ప్రైవేట్ భవనాల కూల్చివేత పనులు జరుగుతున్నాయని ఎన్వీఎస్ రెడ్డి వివరించారు. పాత నగరంలో ఆస్తుల కూల్చివేతలో ఉన్న సవాళ్లను వివరిస్తూ.. ఒకదానికొకటి ఆనుకోని ఉన్న భవనాలు, సంక్లిష్టంగా ముడిపడిన విద్యుత్, టెలికాం, ఇతర కేబుల్ వైర్లు వంటి సమస్యలున్నప్పటికీ, హెచ్ఏఎంఎల్ ఇంజినీర్లు, అధికారులు రాత్రిపూట ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా వారసత్వ కట్టడాలను మినహాయించి మిగిలిన ప్రభావిత ఆస్తులను జాగ్రత్తగా కూల్చివేసే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి వారు రాత్రింబవళ్లు కృషి చేస్తున్నారన్నారు.

### ప్రయాణికులకు మరో షాకిచ్చిన హ్యైదరాబాద్ మెట్రో!

కన్సెంట్ అవార్డులకు అంగీకరించేలా ప్రభావిత ఆస్తుల యజమానులను ఒప్పించడంలో హెచ్ఏఎంఎల్ అధికారులు, ముఖ్యంగా మహిళా అధికారులు చేస్తున్న కృషిని ఎండీ శ్రీ ఎన్వీఎస్ రెడ్డి అభినందించారు. పాతనగర వాసులు ఈ ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలన్న ఆకాంక్షతో ఉత్సాహంగా తమ సహకారాన్ని అందిస్తున్నారని, మెట్రో ఎండీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటివరకు నిర్లక్ష్యానికి గురైన పాతనగరంలో, మెట్రో రైల్ ప్రాజెక్టు పనుల ప్రగతిపై వారంతా సంతోషంగా ఉన్నారని ఆయన అన్నారు. ఇప్పటివరకు దాదాపు 311 ఆస్తులను స్వాధీనం చేసుకున్నామని.. సహాయ పునరావాస నష్టపరిహారం కింద వాటి యజమానులకు ఇప్పటివరకు రూ.283 కోట్లు పంపిణీ చేశామని ఆయన తెలిపారు. ఈ ప్రాజెక్టు పాతబస్తీ అభివృద్ధికి, కనెక్టివిటీకి గణనీయంగా దోహదపడుతుందని భావిస్తున్నారు.





# మీ పంతాలకు పసివాడిని బలి చేశారు

- హైదరాబాద్, ఘట్‌కేసర్‌లో విషాదం
- ప్రేమ వివాహం చేసుకున్న రెండేళ్లకే దంపతుల ఆత్మహత్య
- అనాథగా మారిన చిన్నారి
- ఆత్మహత్యచేసుకున్న దంపతులు



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** వారిద్దరూ ప్రేమించుకున్నారు.. ఒకరిని విడిచి ఒకరం బతకలేమనుకున్నారు. పెళ్లి చేసుకోవాలని భావించారు. తమ ప్రేమ విషయం తల్లిదండ్రులకు చెప్పారు. అందుకు వారు అంగీకరించలేదు. దీంతో ఇద్దరు ఇంట్లో నుంచి బయటకు వచ్చి వివాహం చేసుకున్నారు. వీరికి పెళ్లై రెండేళ్లు. వీరి ప్రేమకు గుర్తుగా ఏడాది వయసున్న బాబు కూడా ఉన్నాడు. అంతా బాగుంది అనుకున్నసమయంలో దంపతులు తీసుకున్న నిర్ణయంతో పాపం పసివాడు అనాథగా మిగిలాడు. పెద్దలను ఎదిరించి మరీ పెళ్లిచేసుకున్న వారు.. ఆ బంధాన్ని కడవరకు కాపాడుకోలేకపోయారు. పైగా చిన్న వయసులోనే వివాహం చేసుకున్నారు. ఆ అమ్మాయి డిగ్రీ చేస్తుంది. అబ్బాయి పనీపాటలేకుండా తిరగడమే కాక మద్యానికి అలవాటుపడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు. ఈక్రమంలో క్షణికావేశంలో.. బిడ్డ గురించి కూడా ఆలోచించకుండా దంపతులు ఆత్మహత్యాప్రయత్నం చేశారు. ఈ ఘటనలో భార్య మరణించగా.. భర్త తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పాపం తల్లిదండ్రులు లేరని తెలియని చిన్నారి.. వారి కోసం గుక్కపట్టి ఏడుస్తుంటే చూసిన వారంతా కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఈ విషాదకరం సంఘటన వివరాలు. ఈ సంఘటన హైదరాబాద్ , ఘట్‌కేసర్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌కు చెందిన పి.మధు, సుగుణ దంపతులకు ఒక కుమార్తె దీపిక(18) ఉంది. అయితే కొన్నాళ్ల క్రితం దీపికకు అదే ప్రాంతానికి చెందిన సంతోష్‌తో పరిచయం ఏర్పడి అది కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలని భావించిన దీపిక, సంతోషలు ఆ విషయాన్ని తల్లిదండ్రలుకు చెప్పారు. అయితే వారి కులాలు వేరు కావడంతో వీరి పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. దీంతో రెండేళ్ల క్రితం వీరిద్దరూ ఇంటి నుంచి వచ్చేసి కులాంతర వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఏడాది వయసున్న దేవాన్ష్ అనే కొడుకు ఉన్నాడు. దీపిక కాలేజీకి వెళ్తుంది. ఇక పెళ్లైన కొత్తలో వీరద్దరూ బాగానే ఉన్నప్పటికీ.. ఈమధ్య కాలంలో దంపతుల మధ్య తరచుగా గొడవలు అవుతున్నాయి. పైగా సంతోష్ మద్యానికి బానిసై భార్యాబిడ్డలను పట్టించుకోవడంమానేశాడు. పని చేయకుండా బలదూర్‌గా తిరగడం ప్రారంభించాడు. ఈ విషమై భార్యాభర్తల మధ్య గొడవలు పెరిగాయి. కొన్ని రోజుల క్రితమే కుల పెద్దల మధ్య పంచాయతీ కూడా పెట్టారు. వారు దీపికను తన తల్లిదండ్రుల వద్ద ఉండాలని చెప్పడంతో.. ఆమె పుట్టింటికి వచ్చింది. ఈక్రమంలో బుధవారం నాడు దీపిక కాలేజ్‌కి వెళ్లిందని తెలుసుకున్న సంతోష్ అక్కడికి వచ్చి ఆమెను వేధించాడు. ఆ తర్వాత రాత్రి దీపిక తల్లిదండ్రులు ఉంటున్న ఇంటికి వచ్చాడు సంతోష్. అనంతరం భార్యను గదిలోకి తీసుకెళ్లి.. తన వెంట రావాలని ఒత్తిడి చేశాడు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో.. విచక్షణ కోల్పోయిన సంతోష్.. తన వెంట తెచ్చుకున్న బ్లేడుతో శరీరంపై కోసుకున్నాడు. ఇది చూసి భయపడిపోయిన దీపిక.. భర్త ఎదుటే ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. ఇది గమనించిన సంతోష్ భయంతో కేకలు వేశాడు. దీంతో కుటుంబ సభ్యులు పరుగున వచ్చి చూడగా.. దీపిక ఫ్యాన్‌కు వేలాడుతు కనిపించింది. ఇరుగు పొరుగు సాయంతో కుటుంబ సభ్యులు రూమ్ డోర్ పగులకొట్టారు. దీపికను కిందకు దించారు. కానీ ఆమె అప్పటికే చనిపోయింది. ఇక సతీష్‌కు తీవ్ర గాయాలు కావడంతో ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# హైదరాబాద్ మహిళలకు రేవంత్ సర్కార్ శుభవార్త

- హైదరాబాద్ మహిళల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం
- నగరంలో కూడా స్వయం సహాయక సంఘాలు
- నాలుగు నెలల్లో ఏర్పాటు చేయాల్సిందిగా కలెక్టర్లకు ఆదేశాలు
- హైదరాబాద్‌లో స్వయం సహాయక సంఘాలు



**(ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ మహిళల కోసం రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇది ఒకరకంగా వారికి గొప్ప శుభవార్తలాంటిది అని చెప్పవచ్చు. ఇంతకు ప్రభుత్వం తీసుకున్న ఆ నిర్ణయం ఏంటంటే.. గ్రేటర్ హైదరాబాద్, అలానే నగర శివారు ప్రాంతాల్లోని మున్సిపాలిటీల్లో మరిన్ని మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని భావిస్తోంది. రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాలు భారీగా సంఖ్యలో ఉన్నాయి. వీటి ద్వారా బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో తక్కువ వడ్డీకే లోన్లు తీసుకుని.. ఎలాంటి ఇబ్బంది లేకుండా నెలవారీగా చెల్లించే అవకాశం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వం వడ్డీ మొత్తాన్ని కూడా మాఫీ చేస్తుంటుంది. ప్రైవేటు వడ్డీ వ్యాపారుల బారిన పడకుండా కాపాడటంలో మహిళా స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే హైదరాబాద్ నగరంలో మాత్రం ఇవి పెద్దగా లేవు. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం హైదరాబాద్, నగర శివారు మున్సిపాలిటీల్లో వీటిని పెద్ద సంఖ్యలో మహిళా సంఘాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం రెడీ అవుతోంది. హైదరాబాద్ నగరంలో కూడా మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయాలని స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఉన్నతాధికారులు గురువారం నాడు రంగారెడ్డి, మెడ్చల్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్లకు సూచించారు. ఈ సంఘాల్లో చేరేందుకు 18 ఏళ్లు నిండిన యువతుల నుంచి వయసుపైబడిన వరకూ అందరికి అవకాశం కల్పించాలని తెలిపారు. అంతేకాక సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉంటే.. కొత్త సంఘాలను స్థాపించాలని తెలిపారు. మరో నాలుగు నెలల్లోనే ఈ సంఘాలు ఏర్పాటు కావాలన్నారు. ఈ కేంద్రాల ద్వారా మహిళలు, యువతులు ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. దీనిలో భాగంగా వారికి .. విద్యార్థుల యూనిఫామ్ కుట్టేపని., విద్యుత్ బస్సులు, సోలార్ పవర్ ప్లాంట్లు, మహిళా శక్తి క్యాంటీన్లు, ధాన్యం సేకరణ కేంద్రాల బాధ్యతను అప్పగించి.. వారు ఆర్థిక సాధికారిత సాధించేందుకు మద్దతివ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బ్యాంకుల నుంచి స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇప్పిస్తామని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు తెలిపారు. హైదరాబాద్, పరిసర జిల్లాల్లో తర్వలోనే కొత్తగా ఏర్పాటయ్యే ఈ స్వయం సహాయక బృందాల సభ్యుల కోసం ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి భవన్‌ను అందుబాటులోకి తీసుకురానుంది. వీటి ద్వారా కొత్తగా ఏర్పాటయ్యే స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించనన్నారు. ఈ సంఘాల్లో చేరేందుకు ఆసక్తి చూపే యువతులు, మహిళలతో పాటుగా దివ్యాంగులు, వృద్ధులను గుర్తించి.. వారిని ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు.

# హమ్మయ్య.. కాస్త ఉపశమనం

**హైదరాబాద్ :** హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ .. దాని పరిసర ప్రాంతాల నుంచి పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని తగ్గించడానికి దక్షిణ మధ్య రైల్వే పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. చాలా వరకు రైళ్లను చర్లపల్లి, కాచిగూడ, నాంపల్లి వంటి ఇతర స్టేషన్ల నుంచి నడుపుతున్నారు. అయితే కొన్ని ప్రత్యేక రైళ్లను నేరుగా ఇక్కడి నుంచే ప్రారంభిస్తున్నారు. తాజాగా మరో రైలును సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచే ప్రారంభించనున్నారు. జూన్ 14న ఈ రైలు ప్రారంభం అవుతుంది. ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ నుంచి 'గంగా–రామాయణ పుణ్య క్షేత్ర యాత్ర' కోసం భారత్ గౌరవ్ పర్యాటక రైలు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు భక్తులను భారతదేశంలోని అత్యంత పవిత్రమైన పుణ్య క్షేత్రాలకు తీసుకెళ్తుంది. యాత్రికులు వారణాసి (కాశీ), అయోధ్య, నైమిశారణ్యం, ప్రయాగ్‌రాజ్ (ప్రయాగ) త్రివేణి సంగమం వంటి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాలను దర్శించుకునే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. హిందూ ధర్మంలో ఈ ప్రదేశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది.. తరతరాలుగా భక్తులు వీటిని సందర్శించడానికి ఆసక్తి చూపుతుంటారు. ఈ రైలు సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై, పలు ముఖ్యమైన స్టేషన్లలో ఆగుతూ వెళుతుంది. భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దా రోడ్, పూరీ (జూత్‌కరాజ్), భువనేశ్వర్, భువనేశ్వర్ రోడ్, బాలాసోర్ వంటి స్టేషన్లు ఉన్నాయి. ఇది రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ఈ యాత్రలో పాల్గొనడానికి వీలు కల్పిస్తుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ దక్షిణ మధ్య రైల్వేకు ఒక ముఖ్యమైన కేంద్రం. నగరంలో పెరుగుతున్న జనాభాకు, దేశంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇది నిత్యం రద్దీగా ఉంటుంది. రద్దీని తగ్గించడానికి కొన్ని రైళ్లను ఇతర స్టేషన్ల నుంచి నడుపుతున్నప్పటికీ.. ప్రత్యేక సందర్భాలలో పర్యాటక, ఆధ్యాత్మిక యాత్రల కోసం నేరుగా సికింద్రాబాద్ నుంచి రైళ్లను ప్రారంభించడం ప్రయాణికులకు పెద్ద ఉపశమనం. ఇటీవల కాలంలో సికింద్రాబాద్ నుంచి మరిన్ని ప్రత్యేక రైలు సేవలు ప్రారంభమయ్యాయి. వీటిలో వేసవి ప్రత్యేక రైళ్లు, పండుగ రద్దీని తగ్గించడానికి నడిపే రైళ్లు వంటివి ఉన్నాయి. ఈ చర్యలన్నీ ప్రయాణికుల సౌలభ్యాన్ని పెంపొందించడం, రైల్వే రవాణాను మరింత సమర్థవంతంగా మార్చడం లక్ష్యంగా సాగుతున్నాయి. ప్రయాణికులు ఈ ప్రత్యేక రైళ్ల సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని రైల్వే అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గన్‌తో బెదిరించి.. రూ.5లక్షలతో ఉడాయించిన దొంగలు

**కొంపల్లి:** కిరాణా షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్న ఓ వ్యక్తికి అనుకోని కష్టం వచ్చింది. రాత్రివేళ గన్‌తో బెదిరించి.. అతడి వద్ద నుంచి 5 లక్షల రూపాయలు, సెల్ ఫోన్ లాక్కెళ్లారు దుండగులు. ఈ సంఘటన కొంపల్లిలో వెలుగు చూసింది. దీంతో చుట్టుపక్కల జనాలు భయాందోళనకు గురవుతున్నారు. మెయిన్ రోడ్డు మీద ఉన్న కిరాణా షాపులోనే ఈ సంఘటన చోటు చేసుకోవడంతో ఒక్కసారిగా ఈ ప్రాంతవాసులు ఉలిక్కిపడ్డారు. పూర్తి వివరాలు హైదరాబాద్‌కు చెందిన మోటూరి సాయిబాబా.. కొంపల్లిలో మెయిన్ రోడ్డు పక్కనే లక్ష్మి కిరాణా జనరల్ షాపు నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి షాపు మూసే సమయంలో దొంగతనం చోటు చేసుకుంది. రోజంతా అమ్మకాల ద్వారా వచ్చిన మొత్తం రూ.5లక్షలు, తన మొబైల్ తీసుకుని షాపు మూసివేసేందుకు రెడీ అవుతున్నాడు. మరి ఎక్కడి నుంచి వచ్చారో తెలియదు కానీ ఇద్దరు దుండగలు స్కూటీ మీద వచ్చి.. షాపు దగ్గర ఆగారు. ఇద్దరు ముఖాలకు హెల్మెట్ పెట్టుకుని ఉన్నారు. వారిలో ఓ వ్యక్తి స్కూటీ మీద నుంచి కిందకు దిగి సాయిబాబా దగ్గరకు వెళ్లి గన్ చూపించాడు. చేతిలో ఉన్న నగదు బ్యాగ్‌ను తమకివ్వాల్సిందిగా బెదిరించి.. దాన్ని లాక్కుని పారిపోయే ప్రయత్నం చేశాడు. అయితే సాయిబాబా దగ్గర పని చేస్తున్న పర్వేజ్ అనే వ్యక్తి.. దుండగుడిని ఆపేందుకు తీవ్రంగా కృషి చేశాడు. కానీ అతడు వారి చేతి నుంచి తప్పించుకున్నాడు. ఇంతలో మరోక వ్యక్తి స్కూటీ వేసుకుని రావడంతో.. నగదు బ్యాగ్ లాక్కున్న వ్యక్తి అక్కడి నుంచి తప్పించుకుని స్కూటీ ఎక్కాడు. ఆ తర్వాత దుండుగులు ఇద్దరు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అయితే ఈ షాపులో చోరీ జరగడం ఇదే ప్రథమం కాదు. గతంలో కూడా ఇదే దుకాణంలో రూ.10 లక్షల విలువ చేసే సిగరెట్లు, ఇతర వస్తువులు చోరీకి గురయ్యాయి. గతంలో దొంగతనం జరిగిన సమయంలోరాత్రి షాపు ముందు ఇక డీసీఎం వాహనాన్ని పార్క్ చేసి.. ఆ తర్వాత గుట్టు చప్పుడు కాకుండా షాపులోని వస్తువులను దానిలోకి ఎక్కించి.. మెల్లగా అక్కడ నుంచి జారుకున్నారు దుండగులు. ఇప్పుడు మరో సారి ఇదే షాపులో దొంగతనం చోటు చేసుకోవడం గమనార్హం. ఇదే ప్రాంతంలో వరుస దొంగతనాలు, సెల్ ఫోన్లు, పార్కింగ్ చేసిన బైక్‌లను కూడా గుట్టుచప్పుడు కాకుండా తీసుకెళ్తున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో గత కొన్ని రోజుల నుంచి వరుసగా దొంగతనాలు, హత్య, ఇతరచిన్న చిన్న నేరాలు వెలుగు చూడటం వల్ల స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పోలీసులు భద్రత ఏర్పాటు చేయాల్సిందిగా కోరుతున్నారు.

# నాలా సమస్య.. ఎంఐఎం ఎమ్మెల్యేపై తిరగబడ్డ స్థానికులు.. కార్యకర్తలను చితకబాది

**హైదరాబాద్ :** వర్షాకాలం ప్రారంభం అయ్యింది. నాలుగు చినుకులు పడినా సరే నగరం చిత్తడి చిత్తడిగా మారుతుంది. ఓ మోస్తరు వర్షం కురిస్తే.. రోడ్లు జలమయం అవుతాయి. ఇక కుండపోత వాన కురిస్తే నాలాలు పొంగి పొర్లుతాయి. నగరవాసులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుంది. ప్రతి ఏటా వర్షాకాలంలో నాలాలు పెద్ద సమస్యగా మారతాయి. నగరంలో ఓ ప్రాంతంలోని నాలా సమస్య కాస్త.. ఎమ్మెల్యే, అతడి అనుచరులపై స్థానికుల దాడికి కారణమయ్యింది. నాలా సమస్యను పరిష్కరించడంలో ఆలస్యం చేస్తున్నారనే కారణంతో.. ఎంఐఎం ఎమ్మెల్యే, అతడి అనుచరులపై కొందరు స్థానికులు దాడి చేశారు. ఆ వివరాలు. ఈ సంఘటన హైదరాబాద్ , నాంపల్లి ప్రాంతంలో వెలుగు చూసిది. నాలా సమస్య పరిష్కరించమంటే.. రేపు మాపు అంటూ దాటవేస్తోన్న ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ని స్థానికులు అడ్డగించారు. తమ సమస్యను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో అడ్డొచ్చిన ఎమ్మెల్యే అనుచరులపై స్థానికులు దాడి చేసి చితకబాదారు. గత కొన్నిరోజులుగా నగరంలో జోరు వానలు కురుస్తున్నాయి. గురువారం తెల్లవారుజామున, సాయంత్రం వేళల్లో కూడా కుండపోత వాన కురిసింది. ఈక్రమంలో భాగ్యనగరంలో కురిసిన భారీ వర్షాలకు నాలాలు పరిస్థితిని పరిశీలించడానికి నాంపల్లి ఎంఐఎం ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ ఆ ప్రాంతానికి వచ్చారు. అయితే యాకుత్‌పుర పరిధిలో నాలా సమస్యను పరిష్కరించాలంటూ స్థానికులు ఇప్పటికే అనేక సార్లు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. కానీ ఆయన దాన్ని సీరియస్‌గా తీసుకోలేదు. ఈ క్రమంతో తాజాగా నాలాలను పరిశీలించడానికి ఈ ప్రాంతానికి వచ్చిన ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్‌ను స్థానికులు నాలా సమస్య పరిష్కారంపై నిలదీశారు. వర్షాకాలం మొదలై సుమారు రెండు వారాలకు పైనే అయినా.. ఇంకా నాలా పనులు మొదలు పెట్టలేదని.. దీని వల్ల ఈ ప్రాంతంలో ఉండే వారు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ఎమ్మెల్యేకు, స్థానికులకు మధ్య మాటామాట పెరిగి.. చివరకు అది కాస్త ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో స్థానికులు కొందరు ఎమ్మెల్యేను తోయడంతో గొడవ మరింతపెద్దదయ్యింది. ఇక జనాలను అడ్డుకునేందుకు.. ఎమ్మెల్యే అనుచరులు ప్రయత్నించగా.. వారిపై కూడా దాడి చేసి చితకబాదినట్లు తెలుస్తోంది. గొడవ కాస్త పెద్దది కావడంతో ఎమ్మెల్యే జాఫర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# హైదరాబాద్ నుంచి ఆలయాలు, దర్శనీయ ప్రదేశాలకు ప్రత్యేక బస్సులు..

**హైదరాబాద్, మియాపూర్ నుంచి ప్రత్యేక టూరిస్ట్ బస్సులు**
**ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని దర్శనీయ స్థలాలకు ప్రత్యేక బస్సులు**
**వివరాలు వెల్లడించిన మియాపూర్–1 డిపో మేనేజర్**
**మియాపూర్ నుంచి ప్రత్యేక టూరిస్ట్ ప్యాకేజీలు**



**హైదరాబాద్ (ఆకాంక్ష న్యూస్) :** హైదరాబాద్ వాసులకు టీఎస్ఆర్టీసీ శుభవార్త! మియాపూర్ డిపో నుండి శని, ఆదివారాల్లో తెలంగాణలోని యాదగిరిగుట్ట, వేయి స్తంభాల గుడి వంటి పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. రెండు రోజుల టూర్‌కు రూ.2 వేలు ఛార్జీ కాగా, ఏపీలోని పుణ్యక్షేత్రాల సందర్శనకు 4 రోజుల టూర్‌కు రూ.4 వేలు వసూలు చేస్తారు. 30 మందికి పైగా భక్తులుంటే ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. హైదరాబాద్ నగర వాసులకు టీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని ఆధ్యాత్మిక కేంద్రాలకు వెళ్లాలనుకునే వారి కసం మియాపూర్–1 డిపో నుంచి ప్రత్యేక బస్సు సర్వీసులను ప్రారంభించనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. భక్తుల కోసం ప్రతి శని, ఆది వారాల్లో ఈ డిపో నుంచి పలు పుణ్యక్షేత్రాలు, సందర్శనీయ ప్రదేశాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయి. పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని డిపో మేనేజర్ కోరుతున్నారు. ఇక మియాపూర్–1 డిపో నుంచి తెలంగాణలోని ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాలైన యాదగిరిగుట్ట, లక్నవరం, బొగత జలపాతం, వేయి స్తంభాల గుడి, భద్రకాళి ఆలయం, స్వర్ణగిరి, జైన్ మందిర్, మేడారం, మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి ఆలయం,రామప్ప ఆలయాల సందర్శనకు వెళ్లాలనుకునే వారి కోసం ప్రత్యేక బస్సు సర్వీసులు అందుబాటులో ఉండనున్నాయని తెలిపారు. రెండు రోజుల టూర్‌లో భాగంగా పైన పేర్కొన్న ప్రాంతాలన్నింటిని దర్శనం చేసుకునే వచ్చేందుకు వీలుగా ఒక టూరిస్ట్ ప్యాకేజీని నడపనున్నట్లు డిపో మేనేజర్ వెల్లడించారు. ఇందుకోసం సూపర్ లగ్జరీ బస్సులను కేటాయించనున్నారు.

## ప్రయాణం సాగుతుందిలా..

ఈ టూరిస్ట్ బస్సులు మియాపూర్ నుంచి ఉదయం శనివారం ఉదయం 5 గంటలకు ప్రయాణం ప్రారంభిస్తాయి. పైన పేర్కొన్న అన్ని ప్రాంతాలను సందర్శించిన తర్వాత ఆదివారం రాత్రి 10గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి. ఇందుకు గాను ఒక్కో ప్రయాణికుడి నుంచి రూ.2 వేల రూపాయలు ఛార్జీలు వసూలు చేస్తామని డిపో మేనేజర్ పేర్కొన్నారు.

## ఏపీకోసం మరో టూరిస్ట్ ప్యాకేజీ..

తెలంగాణనే కాకుండా ఏపీలోని పుణ్యక్షేత్రాల సందర్శన కోసం కూడా టూరిస్ట్ ప్యాకేజీ తెచ్చినట్లు మియాపూర్ డిపో మేనేజర్ తెలిపారు. ఇందుకోసం ప్రతి శని, ఆదివారాల్లో విజయవాడ కనకదుర్గమ్మ, ద్వారకా తిరుమల, అన్నవరం, సింహాచలం, వైజాగ్, అరకు ప్రాంతాలను సందర్శించుకునేలా ఓ ప్యాకేజీ తీసుకువచ్చాం అన్నారు. 4 రోజుల్లోనే పైన పేర్కొన్న ప్రాంతాలన్నింటి చూసుకుని.. తిరిగి హైదరాబాద్ చేరుకునేలా సూపర్ లగ్జరీ బస్సులతో ప్రత్యేక టూర్ ప్యాకేజీ నడపుతున్నట్లు డీఎం తెలిపారు. ఇక ఈ బస్సు మియాపూర్ నుంచి శుక్రవారం రాత్రి 8 గంటలకు బయల్దేరి దర్శనాల అనంతరం సోమవారం రాత్రి 10 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుందన్నారు. ఇందుకు గాను ఒక్కో ప్రయాణికుడి దగ్గర నుంచి రూ.4వేలు ఛార్జీ వసూలు చేస్తున్నామని తెలిపారు. ఈ టూరిస్ట్ ప్యాకేజీలకు సంబంధించి పూర్తి వివరాల కోసం 99592 26153, 85003 09052, 76590 29882 నంబర్లకు కాల్ చేయాల్సిందిగా తెలిపారు. అంతేకాక 30 మందికి మించి భక్తులు ఉంటే ఏ రోజైనా ఈ ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపిస్తామని తెలిపారు.

